PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 198 | విజయవాడ, ఆదివారం 19 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 19 February 2023 | Rs

ధాన్యం కొనుగోళ్లకు గోదాముల సమస్య

- పేరుకుపోయిన 12 లక్షల టన్నులు
- రైతుల వద్ద ఇంకా 40 లక్షల టన్నులు
- మిగిలిన టార్గెట్ 5 లక్షల టన్నులే

• లోపలి పేజీలో.. •



మరో 12 చీతాలు రాక

కునో నేషనల్ పార్క్‌లో వదిలిపెట్టిన మధ్యప్రదేశ్ సిఎం

• లోపలి పేజీలో.. •



కోటప్పకొండకు పోటెత్తిన యాత్రికులు

- ఆకట్టుకున్న ప్రభలు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి

ప్రజాశక్తి- యంత్రాంగం

మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలంలోని కోటప్పకొండకు రాష్ట్రం నలుమూలల నుంచి యాత్రికులు పోటెత్తారు. రైతులు, ప్రజలు గ్రామాల నుంచి ప్రభలు కట్టుకుని తరలివచ్చారు. సందర్శకులను విద్యుత్తు ప్రభలు విశేషంగా ఆకట్టుకన్నాయి. విఐపిల తాకిడి బాగా పెరగడంతో కోటప్పకొండకు దర్శనం రెండు గంటలకుపైగా పట్టింది. సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. వేలాది మంది క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపి లావు కృష్ణదేవరాయులు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డొక్కా మాణిక్య వర ప్రసాద్, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తదితరులు ఉన్నారు.

కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

రాష్ట్రంలోని శైవక్షేత్రాలు కిక్కిరిశాయి. శ్రీశైలానికి రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ సందర్శకులు తరలించారు. శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంభలను దర్శించుకునేందుకు సుమారు ఆరు గంటల సమయం పట్టింది. రథశాల ప్రభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీశైల బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి సందర్శకుల వాహనాలు అనుకున్న స్థాయికి మించి వచ్చాయి. దీంతో, సున్నిపెంటలోని శ్రీశైలం-హైదరాబాదు ప్రధాన రహదారి పార్కింగ్ స్థలం వద్ద ప్రయివేటు వాహనాలను నిలిపివేశారు. సున్నిపెంట ప్రాజెక్టు హైస్కూల్ ఆట స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేసి అక్కడి నుండి ఆర్‌టిసి బస్సుల ద్వారా ప్రయాణం చేయాలని పోలీసులు చెప్పారు. దీంతో, ప్రయివేటు వాహనదారులు కొంత ఆగ్రహానికి గురై పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. శివ స్వాములు, వృద్ధులు, వికలాంగులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి క్షేత్రం కిక్కిరిసిపోయింది. శనివారం వేకువజామున రెండున్నర గంటల నుంచి దర్శనాలు మొదలయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలోని పెదకాకాని, అమరావతి, ద్వైద, సత్రశాల, క్వారీ తదితర క్షేత్రాలకు భారీగా సందర్శకులు తరలివచ్చారు.

అమెరికాలో ఆరుగురి కాల్చివేత

- అనుమానితుడి అరెస్టు

మిస్సిస్సిపి : అమెరికా మిస్సిస్సిప్పీ టేట్ కౌంటీలో ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టేట్ కౌంటీ షెరీఫ్ బ్రాడ్ లాన్స్ తెలిపిన వివరాల ప్రకారం ఆగంతకుడు అర్కబుట్ల రోడ్డులోని ఓ దుకాణంలో ఒకరిని కాల్చివేశాడు. అర్కబుట్ల డ్యామ్ రోడ్డులోని ఓ ఇంట్లో మహిళను కూడా తుపాకితో కాల్చివేశాడు. ఈ ఘటనలో ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఆ రోడ్డులో అనుమానితుడిని గుర్తించిన టేట్ కౌంటీ సహాయకులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నలుగురు హత్యకు గురైనట్లు అధికారులు గుర్తించారు. అర్కబుట్ల ఆనకట్ట రోడ్డులో ఇంటి లోపల ఇద్దరు, బయట మరో ఇద్దరు మరణించి కనిపించారు. 'బాధ్యుడైన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను ఒంటరిగానే హత్యలకు పాల్పడ్డాడని భావిస్తున్నాం. ఎందుకు ఈ హత్యలకు పాల్పడ్డాడో తెలియలేదు. మిస్సిస్సిప్పి బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎంబిఐ) దర్యాప్తులో సహాయం కోరింది. అన్ని విధాలా సహకరిస్తాం.' అని మిస్సిస్సిప్పి గవర్నర్ టేట్ రీవ్స్ ట్వీట్ చేశారు.

అమ్మమ్మను తుపాకితో కాల్చిన ఆరేళ్ల బాలిక

ఆరేళ్ల బాలిక కారు నడుపుతున్న అమ్మమ్మను వెనుకసీటులో ఉన్న తుపాకితో కాల్చివేసింది. ఈ ఘటనలో ఆమె ప్రాణాలతో బయటపడింది. నార్త్ పోర్ట్ పోలీసు శాఖ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'ఈ నెల 16న 57 ఏళ్ల మహిళ తన మహిళ తన ఆరేళ్ల మనవరాలిని వెనుక సీటులో కూర్చోబెట్టుకుని కారు నడుపుతోంది. డ్రైవర్ సీటు వెనుక జేబులో ఉన్న తుపాకి తీసి ఆ బాలిక కాల్చింది. ఆ మహిళ కారును ఇంటి వరకూ నడుపుకుని వెళ్లింది. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసింది. దీంతో, ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రాణానికి ప్రమాదం లేదు' అని పేర్కొంది.

'యాక్సిడెంటల్'గా కాల్పులు జరిగినట్లు నార్త్ పోర్ట్‌లోని చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్ తెలిపింది. పిల్లలు తుపాకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబాలకు పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్

వ్యతిరేకించిన పలు రాష్ట్రాలు • ఏకాభిప్రాయమన్న నిర్మలాసీతారామన్

బెల్లం పాకానికి జిఎస్‌టి ఎత్తివేత

పెట్రోల్, డీజిల్‌పై సెస్సు నిలిపివేయాలి : కెఎన్ బాలగోపాల్

2021-22 జిఎస్‌టి పరిహారాన్ని తప్పగా లెక్కించడాన్ని లేవనెత్తిన రాష్ట్రాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జిఎస్‌టికి జాతీయ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు రాష్ట్రాలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే తమ హక్కులకు భంగం కలుగుతుందని ఆ రాష్ట్రాలు వాదించాయి. పంజాబ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరపాల్ సింగ్ చీమా సమావేశం ముగిసిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే బదులు, ప్రతి రాష్ట్రమూ సొంత ట్రిబ్యునల్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తాము ప్రతిపాదించినట్లు చెప్పారు. దీనివల్ల జిఎస్‌టికి సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆయన చెప్పారు. తమిళనాడు ఆర్థికశాఖ మంత్రి త్యాగరాజన్ మాట్లాడుతూ జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్‌పై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను కనీసం 13 రాష్ట్రాలు వ్యతిరేకించాయని చెప్పారు. దీనిపై విస్తృత స్థాయి చర్చ జరగాల్సిఉందన్నారు. అయితే, ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ కొన్ని సవరణలతో అప్పిలేట్ ట్రిబ్యునల్‌పై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు, పాన్ మసాలా, గుట్కా వ్యాపారంలో పన్ను ఎగవేతలను అరికట్టడానికి యంత్రాంగం, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్‌ఎంసి)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మలా సీతారామన్ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాలను వివరించారు.



జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్

జిఎస్‌టి ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆర్థిక బిల్లు

జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు సంబంధించిన జిఒఎం నివేదికను భాషలో స్వల్ప మార్పులతో ఆమోదించామని, దానిని రాష్ట్రాలకు పంపుతామని పేర్కొన్నారు. ఆ తరువాత ట్రిబ్యునల్ ఏర్పాటుకు సంబంధించిన తుది ముసాయిదా రూపొందించనున్నట్లు తెలిపారు. కౌన్సిల్ మళ్లీ సమావేశం కావడానికి ఎక్కువ సమయం లేనందున, తుది అభిప్రాయాన్ని స్వీకరించడానికి, ఆర్థిక బిల్లులో చేర్చడానికి జిఎస్‌టి కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌కు అధికారం ఇచ్చిందని అన్నారు.

రూ.16,982 కోట్ల జిఎస్‌టి బకాయిలు విడుదల

"రాష్ట్రాలకు పెండింగ్‌లో ఉన్న జిఎస్‌టి పరిహారానికి సంబంధించిన మొత్తం బకాయిలు విడుదల చేశాం. జూన్ 2022కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.16,982 కోట్ల జిఎస్‌టి పరిహారం మొత్తం క్లియర్ చేస్తున్నాం. ఇది ప్రస్తుతానికి జిఎస్‌టి పరిహార నిధిలో అందుబాటులో లేదు. కేంద్రం ఖజానా నుండి చెల్లించిన తరువాత భవిష్యత్తులో సెస్ సేకరణల నుండి తిరిగి దానికి తీసుకుంటాం" అని పేర్కొన్నారు. "దీనికి అదనంగా, అకౌంటెంట్ జనరల్ ధ్రువీకరించిన రాష్ట్రాలు చేసిన అదనపు పరిహారం క్లెయిమ్‌లను కూడా కేంద్రం క్లియర్ చేస్తుంది. ఈ మొత్తం రూ.16,524 కోట్లు" అని తెలిపారు.

కింద కోర్టులు, ట్రిబ్యునల్‌లు అందించే సేవలపై పన్ను

"రివర్స్ ఛార్జ్ మెకానిజం కింద కోర్టులు, ట్రిబ్యునల్‌లు అందించే సేవలపై పన్ను విధించాలని నిర్ణయం తీసుకున్నాం. చట్టం, ప్రక్రియ సంబంధిత విషయాలపై మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. కంటైనర్‌ల కోసం ఉపయోగించే డేటా లాగర్లు, ట్రాకింగ్ పరికరాలు కొన్ని షరతులకు లోబడి 18 శాతం నుండి సున్నాకి తగ్గిస్తున్నాం" అని నిర్మలా సీతారామన్ తెలిపారు. "రాబ్‌పై జిఎస్‌టి రేట్లకు సంబంధించిన (యుపి, ఇతర

మిగతా 2 లో

ఐఓసి గంగవరం పోర్టు ఒప్పందాన్ని రద్దు చేయాలి

- ఎగుమతి, దిగుమతుల అవినీతిపై జ్యుడీషియల్ కమిషన్
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసి) అదాని నిర్వహణలోని గంగవరం పోర్టుతో చేసుకున్న ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఓసి సహజవాయువు దిగుమతుల కోసం అదానీ నిర్వహణలో ఉన్న గంగవరం పోర్టుతో చేసుకున్న ఒప్పందంలో ఆర్థిక నష్టం, అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఐఓసి ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ పోర్టు నుంచి దిగుమతి చేసుకుంటున్నదని వివరించారు. ఇప్పుడు దీనిని కాదని ఇటీవలే అదానీ చేతిలోకి వెళ్లిన గంగవరం పోర్టుతో కనీసం టెండర్లు కూడా పిలవకుండా ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఈ ఒప్పందంలో ఎల్‌ఎన్‌జి దిగుమతి చేసుకున్నా, చేసుకోకపోయినా డబ్బులు చెల్లించాలన్న (టేక్ ఆర్ పే) క్లాజు ఉన్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్‌జోన్ లిమిటేడ్ (ఎపిఎస్‌ఈజెడ్ఎల్) తన ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా స్పష్టం చేసిందని తెలిపారు. అయినా తాము అటువంటి క్లాజులు అంగీకరించలేదని, ఈ ఒప్పందానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఐఓసి బుకాయిస్తుందని వివరించారు. డెమరేజి ఛార్జీలు తప్పుతాయని, మెరుగైన సౌకర్యాలు అని సాకులు చెబుతోందని విమర్శించారు. ఈ కాంట్రాక్టు చేసుకోవడంలో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆధారాలతో సహా చెబుతున్నా.. మోడీప్రభుత్వం నోరు మెదపడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి ప్రజాధనాన్ని అదానీకి కట్టబెట్టడానికి మోడీప్రభుత్వం అర్రులు చాస్తోందని విమర్శించారు. ఒకవైపు అదానీ అవినీతిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నా మరోవైపు అదానీకి కొమ్ము కాయడానికి నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇకనైనా మోడీ ప్రభుత్వం ఈ అక్రమ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటిలాగే విశాఖపోర్టు నుంచి ఆయిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవాలని కోరారు. ఈ అక్రమ కాంట్రాక్టు చేయడానికి కారకులైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐఓసి ఎగుమతి, దిగుమతులపై జ్యూడీషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు.



శివరాత్రి వేడుకల్లో విషాదం

- గోదావరిలో స్నానానికి దిగి నలుగురు మృతి

• లోపలి పేజీలో.. •

బందరు పోర్టు భూ సేకరణకు మార్గం సుగమం

- రూ.90 కోట్లు విడుదల చేసిన ఎపి మారిటైం బోర్డు
- మెరైన్ డివిజన్‌కు 55.37 ఎకరాల ముడా భూములు అప్పగింత

ఏప్రిల్ 5న చలో పార్లమెంటు

జయప్రదానికి అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం పిలుపు

అధ్యక్ష ప్రదాన కార్యదర్శులుగా విజయరాఘవన్, వెంకట్

జ్యోతిబసు నగర్ (హౌరా)నుండి ప్రజాశక్తి ప్రతినిధి

గ్రామీణ భారతానికి తీవ్ర హాని కలిగిస్తున్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్5వ తేదిన జరగనున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం పిలుపు నిచ్చింది. హౌరాలోని జ్యోతిబసు నగర్‌లో జరుగుతున్న ఆ సంఘ జాతీయ మహాసభ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని, వీటిని ప్రతిఘటించడం ద్వారానే ప్రజల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. అంతకుముందు మహాసభకు హాజరైన ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ. విజయరాఘవన్, బి.వెంకట్ ఎన్నికయ్యారు. 155 మందితో జనరల్ కౌన్సిల్ ఏర్పాటైంది. మహాసభ చివరిరోజైన శనివారం ప్రతినిధులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణా నుండి 15 మంది, ఎపి నుండి 12 మంది జనరల్ కౌన్సిల్లో ఉన్నారు. ఆఫీస్ బేరర్స్‌గా ఎ విజయరాఘవన్, బి వెంకట్, గోవిందన్ మాస్టార్, అమియపాత్ర, భానూలాల్ సాహా, లాజర్, జి నాగయ్య, కె కోమలకుమారి, భూప్‌చంద్ చన్నూ, విక్రమ్‌సింగ్, వి శివదాసన్, తుషార్ ఘోష్, వి వెంకటేశ్వర్లు, బ్రిజ్‌లాల్ భారతి, ఎన్ చంద్రన్ ఎన్నికయ్యారు.


ఎ. విజయరాఘవన్, బి.వెంకట్

జనరల్ కౌన్సిల్‌కు ఎపి నుండి వీరే

ఆంధ్రప్రదేశ్ నుండి జనరల్ కౌన్సిల్‌కు వి వెంకటేశ్వర్లు, డి సుబ్బారావు, వి శివనాగరాణి, కెవి నారాయణ, ఎం నాగేశ్వరరావు, కె ఆంజనేయులు, ఎం పుల్లయ్య, ఎం రాజేష్, ఎ రవి, డి వెంకన్న, జి సింహచలం, వి అన్వేష్ ఎన్నికయ్యారు.



తారకరత్న మృతి

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో/ బెంగళూరు

సినీ నటుడు నందమూరి తారకరత్న (40) శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ 'యువగళం' పాదయాత్ర ప్రారంభోత్సవ రోజున గుండెపోటుకు గురైన తారకరత్న అప్పటి నుంచి 23 రోజులుగా బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. తారకరత్న భౌతికకాయాన్ని ప్రజా సందర్శనార్థం సోమవారం ఫిల్మ్‌ఛాంబర్‌లో ఉంచనున్నారు. అదేరోజు సాయంత్రం 5గంటలకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎన్టీయార్ నాల్గో కుమారుడైన మోహన కృష్ణ కుమారుడైన తారకత్నకు భార్య అలేఖ్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తారకరత్న మృతి పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు ప్రభృతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఇక గళ్ల చొక్కా

- ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త యూనిఫాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త రూపు సంతరించుకోనుంది. ప్రస్తుతమున్న ప్లెయిన్ టాప్ స్థానంలో గళ్ల చొక్కా రానుంది. ఈ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు. శనివారం నాడు ఆయన పాఠ్యపుస్తకాల డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి కెవి శ్రీనివాసులు రెడ్డితో కలిసి ముద్రణా కేంద్రాలు, గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం బాలికల టాప్ వంకాయ రంగు, బాలురు స్కైబ్లూ కలర్ షర్ట్‌లు అందజేస్తున్నామని, ఇక నుంచి వీటిని గళ్ల చొక్కాల (చెక్స్ షర్ట్) రూపంలోకి మారుస్తామని తెలిపారు. క్లాత్ పరిమాణం కూడా పెంచుతామన్నారు. రూ.1042 కోట్లతో 43 లక్షల మంది పైగా విద్యార్థులకు జెవికె కిట్లు అందించనున్నట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్ ముద్రణ ప్రారంభమైందని, 1-9 తరగతుల విద్యార్థుల కోసం బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు ప్రచురణ జరగుతోందన్నారు. ఈ ఏడాదికి కొత్తగా 6, 7, 9 తరగతుల కోసం ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను బైలింగ్వల్‌లో తయారు చేస్తున్నట్లు తెలిపారు.

వెయ్యి మందిపై కేసు

- చంద్రబాబు సహా నాయకులు, కార్యకర్తలపై ఎఫ్ఐఆర్
- తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు ఎన్‌ఎస్‌జి నోటీసులు!

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సహా వెయ్యిమందిపై బిక్కవోలు, అనపర్తి పోలీస్ స్టేషన్లలో పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. మరోవైపు చంద్రబాబు పట్ల పోలీసుల తీరుపై ఎన్‌ఎస్‌జి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు, తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు నోటీసు జారీ చేసినట్టు సమాచారం. 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' పేరుతో తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో శుక్రవారం చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించిన విషయం విదితమే. రోడ్ షోను పోలీసులు అడ్డుకోవడంతో బలభద్రపురం నుంచి అనపర్తి వరకు ఏడు కిలోమీటర్లు ఆయన నడుచుకుంటూ వెళ్లారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్త ప్రకాష్ నాయుడును పరామర్శిస్తున్న చంద్రబాబు నాయుడు

చంద్రబాబుకు అండగా నిలిచిన టిడిపి కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. చివరకు అనపర్తి దేవీచౌక్‌లో చంద్రబాబు భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో అనపర్తి, బిక్కవోలు పోలీసు స్టేషన్లలో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. చంద్రబాబు హింసను ప్రోత్సహించారని, పోలీసులపై తిరగబడ్డారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఈస్ట్ జోన్ డిఎస్‌పి భక్తవత్సలం ఫిర్యాదుతో చంద్రబాబు సహా, మాజీ మంత్రులు జవహర్, నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి నాయకులు అవ్వాది స్వామినాయుడు, వనమాడి వెంకటేశ్వరరావు, జ్యోతుల నవీన్, అయితాబత్తుల ఆనందరావు, గొల్లపల్లి సూర్యారావు, వెయ్యిమంది మంది కార్యకర్తలపై సెక్షన్ 143, 353, 149 కింద కేసులు నమోదు చేశారు. రోడ్డు మీద సభలకు అనుమతి ఇవ్వలేమని చెప్పినప్పటికీ తమ సిబ్బందిని తోసుకుంటూ, గెంటివేస్తూ వెళ్లారంటూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఫొటోలు, వీడియోల

మిగతా 2 లో

పోలీసులపై ఎన్‌ఎస్‌జి ఆగ్రహం!

తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు ఢిల్లీలోని ఎన్‌ఎస్‌జి భద్రతా విభాగం శనివారం సాయంత్రం నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. పోలీసులు అడ్డుకోవడంతో అనపర్తికి చంద్రబాబు మూడు గంటలు నడిచి వెళ్లాల్సి రావడంపై ఎన్‌ఎస్‌జి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు, జడ్ ప్లస్ కేటగిరీ నేతకు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆ నోటీసులో పేర్కొన్నట్టు సమాచారం. జామర్లు లేకుండా, అంబులెన్స్ సదుపాయం కల్పించకుండా మూడు గంటలపాటు ఎలా నడిపించారని కేంద్రం నిఘా విభాగం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్టు, ఎవరైనా రాళ్ల దాడి చేసే ప్రమాదం ఉన్నా ఎందుకు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈ నోటీసులో ప్రశ్నించినట్టు తెలిసింది.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

- యాప్‌ల పేరిట బోధనేతర కార్యక్రమాలు సరికాదు
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పార్వతీపురం

ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులపై వివిధ యాప్‌లు, బోధనేతర పనులతో ప్రభుత్వం ఒత్తిడి తేవడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. అన్ని రకాల యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకర్లతో శనివారం ఆయన మాట్లాడారు. యాప్‌ల పేరుతో బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులతో చేయిస్తూ విద్యార్థులకు చదువు చెప్పేందుకు ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని తొమ్మిది వేలకుపైగా ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతోందని చెప్పారు. నాడు-నేడు పనులను పర్యవేక్షించాల్సి రావడం వల్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఉన్న యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తుంటే, అదనంగా బైజూస్ పేరుతో ఏరోజుకారోజు టాబ్‌ల సమాచారం అప్‌లోడ్ చేయాలంటూ ఉపాధ్యాయులపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. బైజూస్‌లో ఉన్న కంటెంట్, టెస్టుబుక్ కంటెంట్ మధ్య తేడా వల్ల విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలను విజిట్ చేయడాన్ని యుటిఎఫ్ స్వాగతిస్తోందని, అదే సందర్భంలో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురయ్యేలా ఈ విజిట్ ఉండరాదని అన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెంచడం వల్ల విద్యార్థుల చదువుపై, ఫలితాలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సాధారణ సెలవులపై కూడా చివరి వరకూ స్పష్టత ఇవ్వకుండా ఉపాధ్యాయులను వేదనకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించి విద్యార్థులకు స్వేచ్ఛ వాతావరణంలో బోధన చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

పోలీసులపై టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేత, మాజీమంత్రి కెఎస్ జవహర్ పట్ల అనపర్తి పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని టిడిపి నేతలు తీవ్రంగా ఖండించారు. జవహర్‌ను అవమానించిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, సిఎం జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు కె అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. జవహర్‌ను అరెస్టు చేసి ఆయన ఫోన్, పర్సు లాక్కుని నేలపై కూర్చోబెట్టారని తెలిపారు. మాజీమంత్రిని నేలపై కూర్చోబెట్టి అవమానిస్తారా అని ప్రశ్నించారు. దళితులంటే జగన్‌కు ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొంతమంది పోలీసులు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖండించిన కెవిపిఎస్

మాజీమంత్రి జవహర్ పట్ల అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేవలం అధిపత్య అగ్రకుల అహంకారంతో ఇలాంటి దాష్టీకానికి పాల్పడినట్లు అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి ఆగడాలపై డిజిపి సమగ్ర పరిశీలన చేయాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

21న మాతృభాష సేవా శిరోమణి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన భాషా కోవిదులను సన్మానించనున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు వెల్లడించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివిఆర్ కృష్ణంరాజుతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. తెలుగుతో పాటు మరాఠి, పంజాబీ, ఒరియా, తమిళ, మళయాల, ఉర్దూ, లంబాడీబంజారా, సంస్కృతం, హిందీ, గుజరాతీ, అస్సామీ, కొంకణి, ఆంగ్ల తదితర భాషలకు చెందిన కోవిదులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా పలు భాషల్లో రచించిన పుస్తకాలను కూడా ఆవిష్కరించనున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ జి రామచంద్రారెడ్డి, పివిఎన్ గ్రూఫ్ చైర్మన్ డాక్టర్ పి వెంకట శేషయ్య, బెజవాడ మీడియా సెంటర్ అధ్యక్షులు చందన మధు పాల్గొన్నారు.

దేవదాయ ఇఒ పోస్టుల పరీక్షకు 94.47 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేవదాయ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్(ఇఒ) పోస్టులకు 94.47శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) 60 ఇఒ పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్షను నిర్వహించింది. శుక్రవారం జరిగిన పరీక్ష వివరాలను ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. 1278 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1248 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో 1179 మంది పరీక్షకు హాజరయ్యారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి, కర్నూలు జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లకు గోదాముల సమస్య

- పేరుకుపోయిన 12 లక్షల టన్నులు
- రైతుల వద్ద ఇంకా 40 లక్షల టన్నులు
- మిగిలిన టార్గెట్ 5 లక్షల టన్నులే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ధాన్యం కొనుగోళ్లను గోదాముల సమస్య కుంగదీస్తోంది. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాల్సి ఉండగా, దాదాపు 12 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు గోదాముల్లో పేరుకుపోయినట్లు సమాచారం. వాటిని తరలిస్తేగాని కొత్తగా ధాన్యం సేకరణ సాధ్యం కాదని పౌరసరఫరాల, వ్యవసాయ, సంబంధిత ఇతర ప్రభుత్వ విభాగాలు వెల్లడించాయి. తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో రైతులు ఆందోళన బాట పట్టగా, గిడ్డంగులు ఖాళీ లేక కనీసం టార్గెట్‌కనుగుణంగానైనా ధాన్యం సేకరణ జరగట్లేదని చెబుతున్నారు. ధాన్యం సేకరణ పాలసీలో ప్రభుత్వ విభాగాలు ధాన్యం తరలింపుపై (మూవ్‌మెంట్) ముందస్తుగా పెద్ద ప్రణాళికనే రచించాయి. ఏ రోజు ఎక్కడికి ఏ అధికారి పర్యవేక్షించాలో తెలిపారు. ఆ ప్లాన్ ప్రకారం తరలించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగా ఆరోపణలొస్తున్నాయి. రైతులు పంట అమ్ముకోలేక నష్టపోతున్నారు.

ఇంకా 5 లక్షల టన్నులు

ఖరీఫ్‌లో 77 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని అర్థగణాంక శాఖ తన రెండవ ముందస్తు అంచనాలో పేర్కొంది. ప్రభుత్వం మాత్రం 37 లక్షల టన్నులే సేకరిస్తామంది. నిరుటి కంటే 3 లక్షల టన్నుల మేర లక్ష్యాన్ని తగ్గించింది. నిర్ణయించిన లక్ష్యంలో ఇప్పటి వరకు అతికష్టం మీద 32 లక్షల టన్నులు సేకరించారు. ఇంకా 5 లక్షల టన్నులు సేకరించాలి. మరోవైపు ఈ తడవ ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో జనవరి, ఫిబ్రవరిలో కోతలు సాగి వడ్లు రైతుల చేతికొస్తున్నాయి. సరిగ్గా ఈ సమయంలో చాలా చోట్ల ఆర్‌బికెలలో కొనుగోలు కేంద్రాలు మూసేశారు. టార్గెట్‌లు పూర్తయ్యాయంటున్నారు. రైతులేమో పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలీక నానా అవస్తలూ పడుతున్నారు.

40 లక్షల టన్నుల పరిస్థితేంటి?

ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్ణయించిన టార్గెట్‌ను చేరినా ఇంకా 40 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంటుందని అంచనా. రైతుల సొంత వినియోగానికి 20 లక్షల టన్నులు మినహాయించినా, ఇంకా 20 లక్షల టన్నులు నికరంగా రైతుల వద్ద ఉంటుంది. ప్రభుత్వం టార్గెట్ మేరకేనని భీష్మిస్తే, రైతులు దక్కినకాడికి ప్రైవేటు వ్యాపారులకు, దళారులకు అమ్ముకోవాల్సిన అనివార్య పరిస్థితి. ఇప్పటికే సేకరించామంటున్న ధాన్యంలో సగానికి కూడా రైతులకు మద్దతు ధర దక్కలేదని అంచనా. మిల్లర్లు, వ్యాపారులు రైతుల నుంచి సాగు రికార్డులు తీసుకొని తృణమోపణమో చేతిలో పెట్టారు. మరోవైపు ప్రభుత్వం ధాన్యం డబ్బులు ఆలస్యంగా రైతుల ఖాతాల్లో వేస్తోంది. ధాన్యం ఇచ్చాక 40-50 రోజులకు కూడా రొక్కం పడట్లేదు. కౌలు రైతులకు ఇది కూడా లేదు.



దీక్షా శిబిరం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ నాయకులు

సేవ్ వైజాగ్ స్టీల్- స్టాప్ ప్రయివేటైజేషన్

- ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'సేవ్ వైజాగ్ స్టీల్, స్టాప్ ప్రయివేటైజేషన్, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని నినాదాలు ముద్రించిన జ్యూట్ బ్యాగులను 1991 బ్యాచ్ సిఎంఎం కార్మికులు తయారుచేసి పంపిణీచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 737వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఎంఎం, సిఎంఇ, సిఆర్‌ఎంపి, టెక్నికల్, లూబ్రికెంట్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, ఈ ప్రాంత ప్రజానీకానికి పోరాట కమిటీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో బాలారిష్టాలను అధిగమించి లాభాల దిశగా నడుస్తున్న విశాఖ ఉక్కును మట్టు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఉత్పత్తిని తగ్గించి, అనేక విభాగాలు మూసివేసి ఈ ఏడాది రూ.2500 కోట్లకు పైగా నష్టాల్లోకి నెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. కరోనా సమయంలో కూడా రూ.28వేల కోట్ల టర్నోవర్‌తో రూ.900 కోట్ల నికర లాభాలను ఆర్జించిన కంపెనీని ఉద్దేశపూర్వకంగా ప్రయివేటీకరణలో భాగంగా మూసివేయడానికి కుట్ర పన్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోనే ప్లాంట్ కొనసాగే వరకు పోరాటాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, కెఎస్‌ఎం.రావు, ఎన్.రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.సురేష్, సన్యాసిరావు, రామ్‌మోహన్‌కుమార్ కరణం సత్యారావు, మోహన్‌బాబు, డి.శ్రీనివాస్, ఎస్‌విసిహెచ్.నాయుడు, బివిఎస్.ప్రకాష్, గుమ్మడి శ్రీనివాస్, కె.భానుమూర్తి, కె.సత్యనారాయణ, శ్రీనివాస్‌నాయుడు, తదితరులు పాల్గొని మాట్లాడారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దీక్షా శిబిరం వద్ద కొవ్వొత్తుల జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

తారకరత్న మృతి పట్ల టిడిపి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సినీ నటుడు నందమూరి తారకరత్న మృతి పట్ల టిడిపి నేతలు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 23 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన తారకరత్న చివరకు తమ కుటుంబానికి అంతులేని విషాదం మిగిల్చాడని టిడిపి అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. తారకరత్నను బతికించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యులు, అభిమానుల ప్రార్థనలు, అత్యం త నిపుణులైన డాక్టర్ల వైద్యం ఫలితాన్ని ఇవ్వలేకపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పవన్ సంతాపం

నందమూరి తారకరత్న కన్నుమూయడం బాధాకరమని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గత మూడు వారాలుగా బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న కోలుకుంటారని భావించానని తెలిపారు. ఆ ఆశలు నెరవేరకుండానే తుదిశ్వాస విడవడం దురదృష్టకరమన్నారు. తారకరత్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

లోకేశ్ పాదయాత్రకు బ్రేక్

తారకరత్న మృతితో లోకేశ్ నిర్వహిస్తున్న పాదయాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం ఉదయం లోకేశ్ హైదరాబాద్‌కు వెళ్తారు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత తిరిగి పాదయాత్ర ప్రారంభమయ్యే అవకాశముంది.

విభజన కేసు 22కి వాయిదా

- రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలి
- చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం వైసిపికి మైనస్ : ఉండవల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర విభజన అంశంపై కోర్టులో ఈ నెల 22న వాయిదా ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ సూచించారు. తూర్పుగోదావరి జిల్లా ప్రకాశం నగర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం లోక్ సభలో అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌ను విభజించారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టులో ఈ నెల 22న విభజన కేసుపై వాయిదాకు ఇంకా నాలుగు రోజులే సమయం ఉందని తెలిపారు. గతంలో తన వాదన సరైందని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నందున రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడానికి ఇదే ఆఖరి అవకాశమని చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో చంద్రబాబును అడ్డుకోవడం వైసిపికి మైనస్ అవుతుందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి, షర్మిల పాదయాత్ర చేశారని, ఇప్పుడు లోకేష్ పాదయాత్ర చేయడం చూస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన పాదయాత్రల్లో చంద్రబాబును అడ్డుకున్న పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. రాజకీయాల్లో హత్యలుండవని, ఆత్మహత్యలే ఉంటాయని తెలిపారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను జైలుకు పంపడం వల్ల ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ పెట్టి జాతీయ పార్టీగా మార్చిన సిఎం కెసిఆర్ ముందుగా పోలవరం విషయంలో ఎపికి సహకరించాలని, హైదరాబాద్‌లో ఉన్న ఆస్తుల్లో ఎపికి రావాల్సినవి పంచిపెట్టాలని, అప్పుడే జాతీయ పార్టీ అని చెప్పుకోడానికి వీలవుతుదని పేర్కొన్నారు.

అదానీ వ్యవహారంలో అనుమానాలు రావడం సహజమని అన్నారు. మోడీ ప్రధాని అయ్యే సమయానికి ప్రపంచ కుబేరుల్లో 309వ స్థానంలో ఉన్న అదానీ 5వ స్థానానికి వెళ్లడం చూస్తే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. కరోనా సమయంలో అందరూ దెబ్బతింటే అదానీ ఆస్తులు పెరిగిపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుందని అన్నారు.

శివరాత్రి వేడుకల్లో విషాదం

- గోదావరిలో స్నానానికి దిగి నలుగురు మృతి

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో మహాశివరాత్రి వేడుకల్లో శనివారం విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసపాడు గ్రామానికి చెందిన ఓలేటి అరవింద్ (20), ఎస్‌కె.లుక్మన్ (19), పెద్దిరెడ్డి రామ్‌ప్రసాద్ (18), మరో నలుగురు కలిసి శివరాత్రి సందర్భంగా పోలవరం మండలం పట్టిసీమ వద్ద ఉత్సవాలను చూసేందుకు వచ్చారు. ఉత్సవాల సందర్భంగా గోదావరి నదిలో స్నానాల కోసం కేటాయించిన రేవులకు దూరంగా అనధికార రేవుల వద్ద స్నానాలకు దిగారు. అక్కడ నది లోతు ఎక్కువగా ఉండడం, గోదావరి ప్రవాహ వేగం అధికంగా ఉండడంతో ముగ్గురు మునిగిపోయారు. ఒడ్డున ఉన్న స్నేహితులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోలవరం సామాజిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని అద్దంపల్లికి చెందిన పంపన శశి వీరేంద్ర (14) తన స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానం చేసేందుకు వచ్చారు. పాతకోట గ్రామం వద్ద స్నానం చేసేందుకు దిగారు. నది లోతు ఎక్కువగా ఉండడంతో మునిగి మృతి చెందారు. మరో బాలుడు మేడిశెట్టి మణికంఠను స్థానికులు రక్షించారు.

రోడ్డుపై బైఠాయించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తి వద్ద యాత్రను అడ్డగించి ముందుకు పోకుండా ఆటంకపరిచిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు సభకు ముందస్తు అనుమతి ఇచ్చి కూడా పోలీసులు చట్టవిరుద్ధంగా రోడ్డుపై వారే బైఠాయించటం, ట్రాఫిక్‌ను ఆటంకపరచడం చట్ట విరుద్ధమని తెలిపారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం నేరమని పేర్కొన్నారు. రాజకీయ కక్షతోనే ఇది చేసినట్లుగా ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి తుంటరి పనులు మానుకొని ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని రాజకీయ పార్టీలు స్వేచ్ఛగా సభలు జరుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పోలీస్ శాఖను కోరారు. రాష్ట్రప్రభుత్వ నిరంకుశ చర్యలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కల్పలతారెడ్డి పైరవీలు

- విషాహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థులను పట్టించుకోని వైనం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

విషాహారం తిని అనారోగ్యంతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించడానికి తీరిక లేని ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డికి ప్రచార ఆర్భాటాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేకపోవడం బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సత్తెనపల్లిలోని రామకృష్ణ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యంపాలైతే ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని గురుకుల పాఠశాలలకు వెళ్లి అక్కడి ఏర్పాట్లపై ఆరాలు తీయడం, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేస్తూ అధికారపార్టీకి అనుకూలంగా ఓట్లు వేయించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.



ప్రభుత్వ వసతి గృహాలకు, గురుకులాలకు సరఫరా అవుతున్న ఆహార పదార్థాలలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు కుమ్మక్కై, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ముడుపులు చెల్లిస్తూ పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో విష రసాయనాలు, జంతు కళేబరాలకు సంబంధించిన అవశేషాలు ఉన్నట్టు తేలిందన్నారు. గురుకుల పాఠశాలలో మంచినీటి శుద్ధి యంత్రం మూలన పడిందని, రక్షిత మంచి నీటి పైపులోకి మురుగు కలిసిన నీరు సరఫరా అవుతోందని విమర్శించారు. తక్షణమే గురుకుల ఎస్‌సి, ఎస్‌టి సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో నాణ్యమైన ఆహారం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి చెందిన ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు ప్రభుత్వ వ్యవహారాలలో తప్ప ప్రజా సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి వ్యవహరిస్తున్నారని, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరారు. కల్పలతా భర్త ప్రతాప్‌రెడ్డి కడప ఇన్‌ఛార్జ్ ఆర్‌జెడిగా విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులతో రహస్య మంతనాలు జరుపుతూ అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరించడం తగదన్నారు.

తక్షణమే ఆయన ప్రచారం నుండి వెనక్కు తిరిగి రావాలని, గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాల్లో కల్తీ మిర్చి, పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

మూడు ఫిషింగ్ హార్బర్ల విస్తరణ

- నబార్డ్ రుణం మంజూరు
- అంగీకార పత్రాలివ్వని రాష్ట్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలోని మూడు ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేసేందుకు నబార్డ్ రుణాన్ని ప్రకటించింది. కాకినాడ జిల్లాలోని ఉప్పాడ, కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్లను ఈ మొత్తంతో ఆధునీకరించనున్నారు. ఒక్కో హార్బర్‌కు రూ.150 కోట్లు చొప్పున రుణాన్ని మంజూరు చేస్తున్నారు. ఈ మేరకు గతేడాది అక్టోబర్‌లోనే రుణ మంజూరుపై నబార్డ్ అధికారికంగా ప్రకటించినప్పటికీ రాష్ట్రం నుంచి ఆ రుణానికి అంగీకార పత్రాలను మాత్రం ఇప్పటికీ ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో మరోసారి ఇదే రుణంపై నబార్డ్ రాష్ట్రానికి లేఖ రాసింది. ఫిషరీస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్ కింద జారీ చేసే ఈ నిధుల తొలి వాయిదాలను మార్చిలోగా విడుదల చేయాల్సి ఉంటుంది. మిగిలిన వాయిదాలను 2025 మార్చిలోగా ఇస్తారు. అయితే రాష్ట్రం నుంచి అంగీకార పత్రాలు అందకపోవడంతో నిధుల విడుదల్లో జాప్యం నెలకొనే పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. నబార్డ్ రుణాన్ని అందించే ఈ పథకం 2022-23 వరకు మాత్రమే కావడంతో త్వరగా అంగీకార పత్రాలను సమర్పించకపోతే రుణమే రద్దయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

- పుస్తక మహోత్సవంలో 'గాంధీజీ హంతకుడు', 'హిందుత్వ పునరాగమనం' ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

గాంధీ తత్వాన్ని తిరిగి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న 33వ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై శనివారం ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. 'గాంధీజీ హంతకుడు' పుస్తకాన్ని మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించగా, 'హిందుత్వ పునరాగమనం' పుస్తకాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. 1857 జాతీయోద్యమాన్ని పరిశీలిస్తే తిరుగుబాటు తరుణంలో సమైక్యతా పోరాటం జరిగిందన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. అనంతర కాలంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రమేయంతో దేశంలో హిందూ మతోన్మాద ధోరణులు పెరిగాయని చెప్పారు. జాతీయోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్‌గానీ, హిందూ మతోన్మాదులు పాల్గొనలేదన్నారు. 2014-23 కాలంలో హిందూ మతతత్వ శక్తులు ఎంతో ప్రమాదక స్థాయికి చేరాయన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త అమర్త్య సేన్‌ను కూడా బెదిరించే స్థాయికి చేరాయని ఆందోళన వ్యక్తంచేశారు. 2014లో ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద పునరాగమం రకరకాలుగా జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో భిన్నత్వంలో ఏకత్వంతోపాటు సమైక్యను చాటుతూ మత సామరస్యాన్ని పెంపొందించేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. గాంధీ వచ్చిన తర్వాత స్వాతంత్రోద్యమ రూపురేఖలు మారాయన్నారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలని, మహిళలకు న్యాయం జరగాలని, సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, దళితులకు న్యాయం జరగాలని, దళితులకు ఆలయాల్లో ప్రవేశం కల్పించాలని, ప్రతి పౌరుడు గౌవరంగా బతికే విధంగా దేశం ఉండాలని ఆకాంక్షించారని అన్నారు. ఈ విధానాలు గాడ్సేకు నచ్చలేదన్నారు. గాంధీ విధానాలు ప్రజల్లో మరింత బలంగా వెళతాయనే ఉద్దేశంతోనే గాంధీని గాడ్సే హత్య చేశాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గాంధీ విధానాల గురించి మరోసారి పూర్తిస్థాయిలో ప్రజలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం అమృత మహోత్సవాలు జరుగుతున్నాయని, కానీ కనీసం గాంధీ గురించి తెలియజెప్పే పరిస్థితే లేదని విచారం వ్యక్తం చేశారు. 1990 అనంతరం సరళీకరణ విధానాల కారణంగా హిందుత్వ భావాలు మరింత పెరిగిపోయాయని, మతోన్మాదులు పనికట్టుకుని మరీ మతాన్ని ప్రచారం చేస్తున్నారని అన్నారు. దేశం అంటే అదాని, మోడీ అనే స్థాయికి వచ్చిందన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలపై నమ్మకం లేని వ్యక్తి న్యాయశాఖ మంత్రిగా ఉన్నారని విమర్శించారు. జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజాతంత్ర లౌకికవాదాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, బుక్‌హౌస్ సంపాదకులు ఎస్.వెంకట్రావు, జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, అనువాదకురాలు కె.ఉషారాణి పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాణిక్యవరప్రసాద్,లక్ష్మణరావు, ఎం.వి.ఎస్ శర్మ, తులసీదాస్, తదితరులు

45 వేలు దాటిన భూకంప మృతుల సంఖ్య

అంటక్యా : టర్కీ, సిరియాలో సంభవించిన భూకంప ప్రమాదంలో మృతుల సంఖ్య 45 వేలు దాటింది. మృతుల సంఖ్య టర్కీలోనే అధికంగా ఉంది. టర్కీలో 39 వేలకు మందికి పైగా మరణించగా, సిరియాలో సుమారు 5,800 మంది మృతి చెందారు. అలాగే భూకంప ధాటికి టర్కీలో సుమారు 2,64,000 అపార్ట్‌మెంట్లు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద ఎవ్వరైనా ఉంటారనే అనుమానంతో సహాయక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. శుక్రవారం టర్కీలో ముగ్గురు వ్యక్తులను సహాయక బృందాలు ప్రాణాలతో వెలికి తీశాయి.

వెయ్యి మందిపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా ఎఫ్ఐఆర్‌లో టిడిపి నేతల పేర్లను పోలీసులు చేరుస్తున్నారు.

క్షతగాత్రులకు చంద్రబాబు పరామర్శ

పోలీసుల లాఠీఛార్జిలో గాయపడి అనపర్తిలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలు మహేష్‌నాయుడు, రవిలను చంద్రబాబు శుక్రవారం పరామర్శించారు. వారితో కొద్దిసేపు మాట్లాడారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అక్రమ కేసులపై న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లో కొంతమంది పోలీసులు అరాచకం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత సభకు అనుమతి ఇచ్చారని, మరుసటి రోజున అనుమతులు లేవంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ప్రతిపక్షాలు నిర్వహించే సభలను అడ్డుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. పోలీసులు చట్టానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని చంద్రబాబు హితవు పలికారు.

జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలకు విలక్షణమైన ఒక రకమైన (ద్రవ బెల్లం) నిర్ణయం తీసుకున్నాం. మేము రాబ్‌పై జిఎస్‌టి రేటును 18 శాతం నుంచి సున్నాకి తగ్గిస్తున్నాం. పెన్సిల్, షార్పనర్‌లపై జిఎస్‌టికి సంబంధించి చాలా చర్చలు జరిగాయి. ఇది 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గిస్తున్నాం" అని వివరించారు. "రూ.20 కోట్ల మొత్తం టర్నోవర్ కలిగిన చిన్న పన్ను చెల్లింపుదారులు, రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్ల టర్నోవర్ ఉన్న రిజిస్టర్డ్ ఎంటిటీల కోసం వార్షిక రిటర్న్‌ల ఆలస్య రుసుము హేతుబద్ధీకరణపై నిర్ణయం తీసుకోబడింది. కొన్ని రిటర్న్‌ల కోసం క్షమాభిక్ష పథకం కూడా ప్రవేశపెడతాం" అని అన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలి : బాలగోపాల్

పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో చర్చించడానికి తమకు ఎజెండాలు ఉన్నాయని, దాదాపు అన్ని రాష్ట్రాలు జిఎస్‌టి కామన్ సెషన్ వ్యవధిని పొడిగించాలని కోరాయన్నారు. జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను, కేంద్ర పన్నుల్లో ఎక్కువ వాటాను డిమాండ్ చేశాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలని అడుగుతున్నామని అన్నారు.

2021-22 జిఎస్‌టి పరిహారాన్ని తప్పుగా లెక్కించడంపై లేవనెత్తిన రాష్ట్రాలు

2021-22 జిఎస్‌టి పరిహారాన్ని కేంద్రం తప్పుగా లెక్కించడాన్ని రాష్ట్రాలు లేవనెత్తాయని తమిళనాడు ఆర్థిక మంత్రి పి త్యైగ రాజన్ అన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తృణధాన్యాల ఉత్పత్తులపై రేటు తగ్గింపు ప్రతిపాదన ఫిట్‌మెంట్ కమిటీకి తిరిగి పంపబడిందని అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ నివేదికపై జిఓఎం అజెండాలో లేదని అన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై కౌన్సిల్ దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చిందన్నారు. తమిళనాడుతో సహా కొన్ని రాష్ట్రాలు జాతీయ ట్రిబ్యునల్‌లోని రాష్ట్ర అప్పిలేట్ ట్రిబ్యునల్‌ల బెంచ్‌ల ఏర్పాటుపై సమస్యలను లేవనెత్తాయని తెలిపారు.

ఏపి క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా ఎల్ జోగి నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా ఎల్ జోగినాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీఓ నెంబర్ 46ని ఆదివారం ప్రభుత్వం జారీ చేసింది. స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ విజయవాడ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదుపరి చర్యలు చేపట్టవలసిందని పేర్కొన్నారు.

అవినాష్‌రెడ్డికి మళ్లీ నోటీసులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో విచారణను సిబిఐ వేగవంతం చేసింది. ఈ మేరకు కడప ఎంపి అవినాష్‌రెడ్డికి మరోమారు సిబిఐ నోటీసులు జారీ చేసింది. వాట్సప్ ద్వారా అధికారులు నోటీస్ పంపారు. ఈ నెల 24న మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. తనకు నోటీసులు అందిన విషయం వాస్తవమేనని ఎంపి అవినాష్‌రెడ్డి ధ్రువీకరించారు.



గత నెల 28న తేదీన మొదటిసారి సిబిఐ విచారణకు పిలిచిన సంగతి తెలిసిందే. ఆదేరోజు నాలుగు గంటల పాటు ఎంపిని విచారించింది. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డి అనుచరులు దస్తగిరి మరికొంత మంది ఇతర సాక్ష్యాలను తారుమారు చేయడం, సిబిఐ స్థాయి అధికారిని బెదిరించడం, ఫోన్ కాల్‌డేటా ఆధారంగా విచారించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజా పిలుపు నేపథ్యంలో ఎంపికి ప్రశ్నలు సంధిస్తుందనే చర్చ నడుస్తోంది. గత నెల 28న ఎంపి విచారణకు హాజరు కాగా, అదే సమయంలో ఇదే హత్య కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఐదుగురు నిందితులు కోర్టుకు హాజరైన సంగతి తెలిసిందే. ఇటీవల ఐదుగురు నిందితుల సైతం కోర్టుకు హాజరు కావడం గమనార్హం. ఏదేమైనా సుమారు 26 రోజుల వ్యవధిలో సిబిఐ నోటీసులు జారీ చేయడం, విచారణను వేగవంతం చేయనుండంతో వైసిపి కార్యకర్తలు, అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

బందరు పోర్టు భూ సేకరణకు మార్గం సుగమం

రూ.90 కోట్లు విడుదల చేసిన ఏపి మారిటైం బోర్డు
మెరైన్ డివిజన్‌కు 55.37 ఎకరాల ముడ భూములు అప్పగింత
త్వరలో ప్రారంభం కానున్న పనులు

మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతం (పాత చిత్రం)



ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

బందరు పోర్టు రైల్, రోడ్డు కనెక్టివిటీ కోసం భూ సేకరణకు మార్గం సుగమమైంది. జిల్లా అధికారులు ఇప్పటికే భూ సేకరణ డ్రాఫ్టు నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ముడ) సేకరించిన రోడ్ రైల్ కనెక్టివిటీకి అవసరమైన భూములను మెరైన్ డివిజన్‌కు బదిలీ చేసింది. మిగిలిన భూముల సేకరణకు అవసరమైన నిధులను ఏపి మారిటైం బోర్డు తాజాగా విడుదల చేసింది. త్వరలో పనులు ప్రారంభించడానికి మెగా ఇంజనీరింగ్ సంస్థ సన్నాహాలు చేస్తోంది. పోర్టుకు అనుసంధానంగా రోడ్డు, రైల్ కనెక్టవిటీకి మొత్తం 103.75 ఎకరాల భూములు అవసరమవుతాయి. ముడ గతంలో సేకరించిన 659 ఎకరాల్లో 55.37 ఎకరాల భూములను మెరైన్ మచిలీపట్నం డివిజన్‌కు స్వాధీనం చేసింది. చిలకలపూడిలో 19.59 ఎకరాలు, కరగ్రహారంలో 18.91 ఎకరాలు, పోతేపల్లిలో 9.88 ఎకరాల చొప్పున మొత్తం 48.38 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వం గతంలో డ్రాఫ్టు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూ సేకరణకు అవసరమైన రూ.90 కోట్ల నిధులను ఏపి మారిటైం బోర్డు తాజాగా విడుదల చేసింది. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం జిల్లా అధికార యంత్రాంగం పరిహారం చెల్లించేందుకు సిద్ధమవుతోంది.

తీర ప్రాంత భూములకు సరిహద్దులు

పోర్టు బెర్తుల నిర్మాణానికి సంబంధించి నాలుగు గ్రామాల్లోని తీర ప్రాంత భూములకు సరిహద్దులను నిర్ధారించారు. మొత్తం 1688.84 ఎకరాలను సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్లు కేటాయించారు. మచిలీపట్నం మండలం మంగినపూడిలో 185 సర్వే నెంబర్‌లో 806.75 ఎకరాలు, తవిశపూడిలోని 139 సర్వే నంబర్‌లో 312.38 ఎకరాలు, గోపవానిపాలెంలో 152 సర్వే నంబర్‌లో 431.48 ఎకరాలు, కరగ్రహారంలో 335 సర్వే నంబర్‌లో 138.23 ఎకరాలను పోర్టు నిర్మాణానికి కేటాయించారు.

త్వరలో పోర్టు పనులు

బందరు పోర్టు నిర్మాణానికి ఇటీవల కేంద్ర పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఈ క్రమంలోనే పోర్టు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో నాలుగు బెర్తుల నిర్మాణానికి రూ.5,156 కోట్లు నిధులు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. దీనికిగానూ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.3,940 కోట్ల రుణం మంజూరుకు ఆమోదం తెలిపింది. మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ క్రమంలోనే కాంట్రాక్టు సంస్థ మెగా ఇంజనీరింగ్ వారు పనులు ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దండ్రు వీరాస్వామి (30), కర్నాటి మహేంద్ర (33), ఊటకూరి ఫణీంద్ర (27), గండికోట శ్రీను భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు అవసరమైన గుమ్మాలను కొనుగోలు చేసేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై పూళ్ల వెళ్లారు. పూళ్ల వద్ద ఒకరి బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో మరో వాహనంలోని పెట్రోలు తీసి నింపుకుంటున్నారు. ఈ క్రమంలో భీమవరం నుంచి భీమడోలు మీదుగా చింతలపూడి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఆగి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వీరాస్వామి, మహేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ఫణీంద్ర, గండికోట శ్రీనును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఫణీంద్ర మృతి చెందారు. ఆస్పత్రిలో శ్రీను చికిత్సపొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు మృతికి కారణమైన ఆర్‌టిసి డ్రైవర్‌ను అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ కురెళ్లగూడెం గ్రామస్తులు పూళ్ల వద్ద రాస్తారోకో చేశారు. పోలీసులు, అధికారులు బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం ఆందోళన విరమించారు.

ఖరీఫ్‌లో నష్టం వాటిల్లిన పత్తి, మిరపకు బీమా వర్తింపజేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2022 ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిరప పంటలు నష్టపోయిన రైతులందరికీ బీమా వర్తింపచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టిఆర్, రంపచోడవరం, కర్నూలు, అనంతపురం, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ మేరకు శనివారం ఎపి రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది లాగే ఈ ఏడాది కూడా నల్ల తామర, గులాబీ, ఆకుముడత వంటి తెగుళ్లు, అకాల వర్షాలు, నకిలీ విత్తనాలతో రైతులుతీవ్రంగా నష్టాన్ని చవి చూశారని పేర్కొన్నారు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మార్చిలోనూ తప్పని 'రుణ' బాధలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అత్యవసర సమయాల్లో చేసే ఓవర్‌డ్రాఫ్ట్ ఆందోళన కలిగిస్తోంది. ఓవర్‌డ్రాఫ్ట్‌పై ఉన్న నిబంధనలు ఈ ఆందోళనకు కారణంగా కనిపిస్తున్నాయి. ఒక త్రైమాసికంలో 36 రోజులకన్నా ఎక్కువగా ఓడీకి వెళ్లరాదు. ఒక వేళ అలా వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం చేసే చెల్లింపులపై రిజర్వ్‌బ్యాంకు నిషేధం విధిస్తుంది. అంటే రాష్ట్ర ఖజానా దివాలా తీసినట్టేనని అధికారులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ త్రైమాసికంలో 22 రోజులు ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే ఉంది. అది కూడా సగం త్రైమాసికం పూర్తయ్యేసరికే ఈ పరిస్థితి నెలకొనగడం గమనార్హం. జనవరి నుంచి ప్రారంభమైన చివరి త్రైమాసికంలో జనవరిలోనే 11 రోజులు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ఈ నెల 15 తేదీ నాటికి మరో 11 రోజుల పాటు ఓడీలో ఉన్నారు. అంటే త్రైమాసికం ముగియడానికి ఇంకా 44 రోజులు ఉంది. ప్రస్తుతం ఓడీకి వెళ్లనిదే దైనందిక ఆర్థిక వ్యవహారాలు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జీతాల చెల్లింపులకు, ఇతర అవసరాలకు కూడా ఓవర్‌డ్రాఫ్టే దిక్కుగా మారింది. ఫిబ్రవరిలో ఇంకా అనేక చెల్లింపులు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక త్రైమాసికం, ఆర్థిక సంవత్సరానికి చివరి నెల అయిన మార్చిలో కూడా భారీగానే నిధులు కావాల్సి ఉంటుంది. మార్చిలో కూడా సెక్యూరిటీ వేలం ద్వారా రుణాలు వచ్చే అవకాశాలు అంతంతగానే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. దీంతో మళ్లీ ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లకతప్పదని చెబుతున్నారు. అయితే చేతిలో మిగిలున్నవి కేవలం 14 రోజులే కావడంతో ఎలా గట్టెక్కాలన్న కోణంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

'సజ్జల'కు భయపడేదేలే

- కేసుల పేరుతో వేధింపులు : ఎమ్మెల్యే కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ పరంగా నిర్వహించాల్సిన పనులన్నింటినీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి వదిలేసి కేవలం తనను టార్గెట్ చేసి నెల్లూరు రూరల్ నియోజకవర్గంపైనే దృష్టిని సాధించారంటూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం నెల్లూరు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తన ప్రధాన అనుచరులను పోలీసులు అరెస్టు చేసిన విధానాన్ని తప్పుపడుతూ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం స్థానికంగా వైసిపి కార్యకర్తలకు, కొంత మంది టిడిపి కార్యకర్తలకు మధ్య వివాదం చోటు చేసుకుంది వాస్తవమే అన్నారు. అప్పట్లో అది పోలీసు కేసు కాదని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని తాను నిలదీస్తున్న సమయంలో తన పక్షాన నిలిచిన నాయకులను, కార్యకర్తలను భయాందోళనలకు గురిచేయాలని షాడో సజ్జల రామకృష్ణారెడ్డి సూచనల మేరకు ఎస్‌సి,ఎస్‌టి, అట్రాసిటి కేసు పేరుతో విచారణ ప్రారంభించారన్నారు. ఈ కేసులో తన పేరు కూడా చేర్చారని, మొత్తం 11 మంది పేర్లను ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటి కేసులో పొందు పరిచారని తెలిపారు. అరెస్టు చేసిన వారిని పోలీసు స్టేషన్‌కు తరలించకుండా సాయంత్రం 6 నుంచి11 గంటల వరకు పలు పోలీసు స్టేషన్లకు తిప్పుతూ మానసికంగా ఇబ్బందికి గురిచేశారన్నారు. శుక్రవారం రాత్రి తాటి వెంకటేశ్వర్లు, జావేద్, మన్నేపల్లి రఘును అరెస్టు చేశారన్నారు. తనకు మద్దతుగా నిలుస్తున్న కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని తెలిపారు.

ఉండి మాజీ ఎమ్మెల్యే సర్రాజు కన్నుమూత

- నివాళులర్పించిన సిఎం జగన్, మంత్రులు
- జక్కరంలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు (70) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. శుక్రవారం రాత్రి ఓ ఫంక్షన్ నుంచి భీమరంలోని తన ఇంటికి వచ్చిన అనంతరం ఆయన అస్వస్థతకు గురయ్యారు. కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సర్రాజు మృతి చెందారని నిర్ధారించారు. సర్రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భీమవరంలోని సర్రాజు నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజకీయ ప్రముఖులు, సిపిఎం, టిడిపి, జనసేన, బిజెపి నేతలు నివాళులర్పించారు. అంతిమయాత్ర భీమవరం నుంచి



సర్రాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం జగన్ (ఇన్‌సెట్‌లో) సర్రాజు

స్వగ్రామం కాళ్ల మండలం జక్కరం వరకూ సాగింది. జక్కరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహిం చారు. 1953లో పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామంలో సర్రాజు జన్మిం చారు. రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరి పలు స్థానిక సంస్థల పదవులు చేపట్టారు. 2004లో ఉండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2021లో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సర్రాజు కుటుంబ సభ్యులు సిఎం జగన్‌కు వినతిపత్రం అందజేశారు. సర్రాజు ఎమ్మెల్సీ పదవి ఆశించారని, శుక్రవారం ఒక ఫంక్షన్‌కు వెళ్లొచ్చిన ఆయన ఇంటికొచ్చాక ఎక్కువ సేపు దీనిపై ఆలోచించారని కుటుంబ సభ్యులు జగన్‌కు వివరించినట్లు సమాచారం.

ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి.రావు మృతి

పలువురు ప్రముఖులు, నేతల నివాళి



అంతమయాత్రలో ఆర్‌టిసి విసి అండ్ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తదితరులు చిత్రంలో వై.వి.రావు

ప్రజాశక్తి-విజయవాడ

ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి పూర్వ ప్రధాన కార్యదర్శి యలమంచిలి వెంకటేశ్వరరావు (వై.వి.రావు) (60) శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఆయన స్వగృహంలో ఆయన మరణించారు. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు ఓ టివి చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆయన అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వై.వి.రావు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. 1990 నుంచి సుమారు 30 ఏళ్లకుపైగా ఆయన ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్లో వివిధ నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. రావు అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం జరిగాయి. అంతిమ యాత్రలో ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, వివిధ యూనియన్ల నాయకులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

వైవి రావు మృతికి ఆర్‌టిసి విసి అండ్ ఎమ్‌డి సిహెచ్.ద్వారకా తిరుమల రావు తీవ్ర సంతాపం తెలిపారు. అంతిమ యాత్రలో పాల్గొని తన భుజాలపై భౌతికకాయాన్ని మోశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వై.వి.రావు అందించిన సేవలు మరువలేని వన్నారు. స్నేహశీలి, మృదుస్వభావి, కార్మిక పక్షపాతిగా పేరు గాంచారని కొనియాడారు. ఇంకా ఆర్‌టిసి విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) గిడుగు వెంకటేశ్వరరావు, ఆర్‌ఎం ఎంవై దానం, పిఎన్‌బిఎస్ డిప్యూటీ సిటిఎం బషీర్ అహమ్మద్ తదితరులు నివాళులర్పించారు.

పలువురు నేతల నివాళి

వై.వి.రావు భౌతికకాయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఎంఎల్‌సి అశోక్‌బాబు, ఇయు రాష్ట్ర కార్యదర్శి పలిశెట్టి దామోదర్, మాజీ కార్యదర్శి పద్మాకర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, అమరావతి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ శివారెడ్డి, ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్, కార్యదర్శి ఇగ్బాల్, సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఇయు రీజనల్ కన్వీనర్ వైఎస్‌రావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.పరమేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ సంతాపం

వైవి రావు మృతి పట్ల ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీలు తీవ్ర సంతాపం తెలిపాయి. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సుందరయ్య, ఎం.అయ్యప్పరెడ్డి, గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.పరమేశ్వరరావు, భాస్కరరావు, ఫెడరేషన్ అనుబంధ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గంగాధర్, నాయకులు ఆర్.కోటేశ్వరరావు, బిడిఆర్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

దుర్గ గుడిలో అనధికారిక ప్రసాదాలు

- రసీదుల్లేకుండా పులిహోర అమ్మకాలు
- తెరవెనుక ఓ ప్రజాప్రతినిధి?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి (కనకదుర్గమ్మ ఆలయం) ఆలయంలో అనధికారికంగా ప్రసాదాలు విక్రయిస్తున్నారు. అయితే ఈ పని చేస్తున్నది బయటి వ్యక్తులు కాదు..ఆలయ సిబ్బందే. ఆలయ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ఈ వ్యవహారం ఆలయ నిర్వాహక నాయకత్వం కనుసన్నల్లోనే నడుస్తోందని, దీని వెనుక స్థానిక ప్రజాప్రతినిధి ఉన్నారని విమర్శలొస్తున్నాయి. సదరు ప్రజాప్రతినిధి మెప్పుకోసం ఉన్నతాధికారులు, ఆలయ ఇఒలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అనధికార ప్రసాదాల విక్రయాల అంశం చర్చనీయాంశం కావడంతో దీనిపై విజిలెన్స్ శాఖ ఆరా తీసినట్లు సమాచారం. మహాశివరాత్రి రోజు కూడా అనధికార ప్రసాద విక్రయాలు యథేచ్ఛగా సాగిపోయాయి. అనధికార ప్రసాద విక్రయాలు ఇలా.. విజయవాడకు చెందిన ఓ భక్తుడు మహాశివరాత్రి సందర్భంగా లడ్డూలు, చక్కెర పొంగళి, పులిహోర తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రసాదాలన్నిటికీ కంప్యూటరైజ్డ్ బిల్ ఇవ్వాలి. కానీ లడ్డూ, చక్కెర పొంగళికి మాత్రమే రూ.70 కంప్యూటరైజ్డ్ బిల్లింగ్‌తో టిక్కెట్లు ఇచ్చారు. పులిహోరకు మాత్రం కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ ఇవ్వకుండా నగదు తీసుకున్నారు. దీనిని బిల్లులో పేర్కొనడం లేదు. కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ అయిన మొత్తం గుడి ఆదాయానికి వెళ్తుంది. నగదుగా స్వీకరించిన ఆదాయం ఎటుపోతుందనేదే ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. నిత్యం వేలాది మంది సందర్శించే దుర్గగుడిలో అనధికార బిల్లింగ్ రహిత ప్రసాద విక్రయాల ద్వారా రూ.లక్షల్లో సొమ్ము ప్రయివేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోందని, సూత్రధారిగా ఉన్న ప్రజాప్రతినిధికి రోజువారీగా మాముళ్లు వెళ్తున్నాయనేది వినికిడి. ఈ వ్యవహారం దేవాదాయశాఖ కమిషనరు నోటీసుకు కూడా వెళ్లినట్లు సమాచారం.

'శివరాత్రి' సందర్భంగా 'యువగళాని'కి విరామం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'యువగళం' పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు శనివారం విరామం ప్రకటించారు. మహాశివ రాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో భక్తుల రద్దీ దృష్ట్యా యాత్రకు విరామం ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకునేందుకు లోకేష్‌కు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద తన సొంత కాన్వాయ్‌లోనే సేద తీరారు. పాదయాత్ర ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డు నుంచి ప్రారంభమై శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చేరుకుంటుంది

బాలికపై అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రయానాంలో బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఐదుగురు నిందితులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అత్యాచారానికి పాల్పడిన ఓలేటి బ్రహ్మతేజ, ఓలేటి తులసీరావు, ఓలేటి ధర్మారావు, మల్లాడి వంశీ, అర్ధాని వీరబాబును బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఈ నెల 17న పోలీసులు అరెస్టు చేశారు. వారిని డిఎస్‌పి వై.మాధవరెడ్డి, ముమ్మిడివరం సిఐ జానకిరామ్ ముమ్మిడివరం కోర్టులో శనివారం హాజరుపర్చారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది.

ఆంధ్రప్రదేశ్‌కు రూ.689 కోట్లు రావాలి

జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో బుగ్గన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) పరిహారం కింద ఆంధ్రప్రదేశ్‌కు మరో రూ.689 కోట్లు రావాల్సి ఉందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం జరిగిన 49వ జిఎస్‌టి కౌన్సిల్ భేటీకి బుగ్గన హాజరయ్యారు. చిన్న వ్యాపార సంస్థలకు విధించే పెనాల్టీలు తగ్గించడం, అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటులో రాష్ట్ర సూచనలను పరిగణనలోకి తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం సూచించిన విధంగానే రూ.20 కోట్ల వ్యాపార పరిమాణం ఉన్న సంస్థలు రిటర్నులు ఆలస్యంగా దాఖలు చేసినప్పుడు విధించే పెనాల్టీలను సవరించడానికి కౌన్సిల్ అంగీకరించినట్లు ఆయన తెలిపారు. అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌లో తీసుకోవాల్సిన సవరణల కోసం మంత్రుల కమిటీ సూచనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మంత్రుల కమిటీలో తానుకూడా సభ్యునిగా ఉన్నట్లు తెలిపారు. ట్రిబ్యునల్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి చోటు కల్పించడంతో పాటు, త్వరగా ఏర్పాటు చేయాలన్న సూచనలకు కౌన్సిల్ అంగీకారం తెలిపినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎన్. గుల్జర్ (ఆదాయపు పన్నులు), రాష్ట్ర పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఎం. గిరిజా శంకర్ తదితరులు హాజరయ్యారు.

500 విమానాలకుఇండిగో ఆర్డర్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒక్కటైన ఇండిగో ఏకంగా 500 విమానాలకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపింది. తమ సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ విమానాల కోసం ఎయిర్ బస్‌కు ఇప్పటికే ఆర్డర్ ఇచ్చామని ఇండిగో ఇంటర్నే షనల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు. ఇండి యా, ఇస్తాంబుల్, యూరప్ ప్రాంతాల మధ్య ప్యాసింజర్ సర్వీసులను పెంచనున్నామన్నారు. ప్రస్తుతం తమ సంస్థ రోజుకు 1,800 విమానాలు రాకపోకలు సాగిస్తున్నా యన్నారు. ఇందులో 10 శాతం విదేశీ రూట్లలో తిరుగుతున్నాయన్నారు. ఈ సంస్థకు ప్రస్తుతం 300 విమానాలు ఉన్నాయి. దేశీయంగా 76, అంతర్జాతీయంగా 26 గమ్యస్థానాలకు సేవలను అందిస్తుంది.

ఐసిసితో పాలిక్యాబ్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ప్రముఖ విద్యుత్ ఉత్పత్తుల కంపెనీ పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ (పిఐఎల్) ఈ ఏడాది జరుగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) మ్యాచ్‌లకు అధికారిక భాగస్వామిగా వ్యవహరించను న్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఐసిసి పురుషుల, మహిళల అంతర్జాతీయ ఈవెంట్లకు స్పాన్సర్‌గా కొనసాగనున్నట్లు పేర్కొంది. 2023 సంవత్సరాంతం వరకూ ఈ ఒప్పందం నిలిచి ఉంటుందని వెల్లడించింది. దీంతో దక్షిణాఫ్రికాలో జరుగనున్న ఐసిసి ఉమెన్స్ టి20 వరల్డ్ కప్, బ్రిటన్‌లో జరుగనున్న ఐసిసి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు, భారత్‌లో జరుగనున్న ఐసిసి పురుషుల వరల్డ్ కప్ 2023 భాగస్వామిగా కొనసాగనున్నట్లు పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిలేష్ మలానీ పేర్కొన్నారు. "పాలీక్యాబ్‌కు ఇది అత్యంత సంతోషకర అంశం. దేశీయంగా అభివృద్ధి చెందిన పాలీక్యాబ్ ఇప్పుడు 60కు పైగా దేశాలలో తమ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ భాగస్వామ్యంతో మా అభిమానులకు మరుపురాని అనుభవాలను అందించనున్నాము" అని నిలేస్ తెలిపారు.


ఏడు శాతం వృద్ధి లక్ష్యం

- విదేశీ వ్యవహారాల మంత్రి వెల్లడి

సిడ్నీ : ప్రస్తుత ఏడాది సహా వచ్చే ఐదేళ్లలో భారత్ ఏడు శాతం పైగా వృద్ధి రేటును అంచనా వేస్తుందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ అన్నారు. శనివారం సిడ్నీలో ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్స్టిట్యూట్ (ఎఎస్‌పిఐ), ఇండియా అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఒఆర్‌ఎఫ్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన సిడ్నీ బిజినెస్ బ్రేక్‌ఫాస్ట్‌లో మంత్రి మాట్లాడుతూ.. "ఈ ఏడాది ఏడు శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాం. వచ్చే ఐదేళ్లలో మరింత పెరగనున్నాం. రాబోయే దశాబ్దనర కాలంలో 7-9 శాతం వృద్ధి రేటును నమోదు చేయనున్నాం. ఇందుకు అనుగుణంగా ఎఫ్‌డిఐ, ఎఫ్‌ఐఐ ప్రతిఫలించనున్నా యి." అని మంత్రి పేర్కొన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య 2022 ఏప్రిల్ 2న కుదిరిన ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (ఇసిటిఎ) డిసెంబర్ 2022 నుంచి అమల్లోకి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

బీమా పాలసీతో పాన్ లింక్

- ముడిపెట్టనున్న ఎల్‌ఐసి



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) తమ పాలసీదారులకు పాన్ కార్డ్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయనున్నట్లు తెలుస్తోంది. ఎల్‌ఐసి పాలసీ కలిగిన వారు వారి పాన్ కార్డును 2023 మార్చి 31లోపు లింక్ చేసుకోవాలని ఆసంస్థ సీనియర్ అధికారి తెలిపారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా సర్వీసులు పొందాలని భావించే వారు కచ్చితంగా పాన్ కార్డును సమర్పించాల న్నారు. లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. పాలసీ కలిగిన వారు కంపెనీ ఎల్‌ఐసి వెబ్‌సైట్‌లో తమ పాన్ కార్డ్‌ను లింక్ చేసుకోవచ్చన్నారు. అదే విధంగా మొబైల్ నెంబర్, ఇ మెయిల్‌ను కూడా అప్‌డేట్ చేసుకోవాలని ఎల్‌ఐసి కోరింది. దీని ద్వారా పాలసీదారులు మరింత సులభంగా సేవలు పొందవచ్చని సూచించింది. ఎల్‌ఐసి దాదాపు 30 కోట్ల పాలసీదారులను కలిగి ఉంది.

సంపాదకీయం

జల విలాపం!

'**ఈ** గాలి ఈ నేలా ఈ ఊరు సెలయేరు' అంటాడో సినీకవి. పంచభూతాల్లో ప్రధానమైన గాలి, నీరు సమస్త జీవకోటికి జీవనాధారం. నీరు అమూల్యమైన వనరు. ప్రపంచంలో దేనికైనా విశ్రాంతి వుంటుందేమోగానీ నీటికి వుండదు. ప్రకృతిలో అనుక్షణం మేల్కొని వుండేది... ప్రతి నిమిషం ఎక్కడోచోట పారుతూనే వుండేది నీరు. ప్రతి రుతువూ నీటి రుతువే. నీరుంటే ప్రతి రుతువు వసంతమే. 'జలం ఒక సంస్కృతి/ జలం ఒక చారిత్రక కృతి/ జలం సకల విన్యాసాల ఆవిష్కృతి' అంటారు డా.ఎన్.గోపి. 'చెరువు/ ఊరుకు బువ్వగిన్నె/ చెరువు/ ఊరుకు అమ్మ పాలరొమ్ము/ చెరువు/ ఊరుకు నాన్న గుండె నది' అంటాడో కవి. చెరువు, సరస్సు, నది, సముద్రం... మనిషితో పెనవేసుకున్న నీటి బంధం. అది మనిషికి ప్రకృతి ప్రసాదించిన వరం.

మనిషి ప్రాథమిక హక్కయిన నీటిని సరళీకరణ కబళిస్తోంది. తాగడానికి నేనిస్తాను... నువ్వు కొనుక్కో అంటోంది. లక్షలాది మంది ప్రజలు తాగునీటి కోసం మైళ్లదూరం నడిచి వెళ్లాల్సి వస్తోంటే... లాభాలను పెంచుకోడానికి, వచ్చిన లాభాలను పంచుకోడానికి నీటి వనరులను ప్రైవేటుపరం చేయ పూనుకోంటోంది బిజెపి ప్రభుత్వం. పెరుగుతున్న కాలుష్యాన్ని సాకుగా తీసుకుని పీల్చే గాలిని సైతం ప్రైవేటీకరించనుంది 'నా నీళ్లు బహుళజాతి కంపెనీలకు/ అమ్మకం సరుకైనాయి/ నా నీళ్లు బాటిల్‌లో నింపబడి/ మార్కెట్ అయినాయి/ నా నీళ్లు నాకు కాకుండాపోయాయి/ నా నీళ్లను నేనే కొనుక్కు తాగాలి/ ఇప్పుడు నా నీళ్లకు నేను పరాయిదాన్ని' అంటారు కవయిత్రి మహెజబిన్. నీటి వనరులు కార్పొరేట్లకు ధారాదత్తం అవుతున్నాయి. మంచినీటి మీద కార్పొరేట్ల అజమాయిషీ, పెత్తనం పెరిగింది. ప్రాణిగా వుండవలసిన నీరు... అమ్మకపు వస్తువై... సీసాల్లో నిల్వ సరుకైంది. అందరికీ సురక్షిత నీటిని అందించాలనే సంకల్పానికి బదులు డబ్బును చెల్లించేవారికే నీటిని అందించాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. నీటి వ్యాపారం కోసం ప్రపంచ ప్రమాణాలను అధ్యయం చేయడానికి నీతి ఆయోగ్ ప్రణాళికలు సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. తద్వారా ప్రైవేట్ సంస్థలు నీటిపైనా, నీటి వనరులపైనా చట్టబద్ధమైన యజమానులుగా ఉంటాయి. ప్రజలందరి ప్రకృతి వనరు బంగారం, వెండి వలే అమ్ముడుపోతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మేరకు ప్రతి మనిషికి రోజుకు 40 లీటర్ల నీరు అవసరం. నీరు వాణిజ్య సరుకుగా మారిన తరువాత గొంతు తడుపుకునే వీలుంటుందా అన్నది ప్రజలను కలవరపెట్టే అతిపెద్ద ప్రశ్న. ఇప్పటికే పేదల కుటుంబాల్లో అత్యధికులు, అధిక సమయం నీటి సేకరణపైనే దృష్టి పెట్టాల్సి వస్తోంది. భారత్ వంటి దేశాల్లో నీటి వ్యాపారం అనే ఆలోచన సమానత్వ భావనకే సవాలుగా నిలుస్తుంది. అందరికీ తాగునీరు, సాగునీరు అనే దానికి బదులుగా డబ్బులు చెల్లించేవారికే నీరు అనే దిశగా ప్రభుత్వాల ఆలోచనలు సాగుతున్నాయి. అంతేకాదు... నీటి వ్యాపారంతో ఏర్పడే కొత్త అసమానతలు... నీటి ఘర్షణలు, యుద్ధాలకు దారి తీస్తాయి.

నీతి అయోగ్ కుటిలనీతి... దేశ ప్రజల నీటి భద్రతకు తీరని ముప్పు. ఇది జల విషాదానికి... జన విలాపానికి కారణమౌతుంది. స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ, ప్రభుత్వాలు ఈ బాధ్యతను గాలికొదిలి, నీటి వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయి. ఇప్పటికీ బాటిళ్లలో అమ్మకపు సరుకైన నీటికంటే... మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో సరఫరా అవుతున్న నీరే స్వచ్ఛమైనదని నిపుణులు చెబుతున్నారు. బాటిళ్లలోని నీటిలో వుండాల్సినంతగా ఖనిజాలు, లవణాలు వుండటంలేదు. దానివల్ల ఆ నీరు అనారోగ్యానికి కారణమౌతోంది. ప్రజలకు నీటిని అందించే బాధ్యత స్థానిక సంస్థలకు అప్పగించి, వాటికి అవసరమైన నిధులను సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, భూగర్భజలాలు ఒట్టిపోకుండా... ప్రతి బొట్టును ఒడిసిపెట్టి, దాచిపెట్టి భవిష్యత్తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. మనిషికి జీవనాధారమైన నీటితో వ్యాపారం చేసే ప్రభుత్వాలను, ప్రకృతిని విధ్వంసం చేస్తూ జలవనరులను హరిస్తున్న కార్పొరేట్లను అడ్డుకోవాల్సిన బాధ్యతా ప్రజలదే.

మహనీయుల మాట




తోకచుక్క కనబడడానికి, రాజులు, ఇతర గొప్పవాళ్లు మరణించడానికి ఏవిధమైన సంబంధం లేదు. అజ్ఞానం భయానికి దారితీస్తుంది. విజ్ఞానం పెరుగుతున్న కొద్దీ యధార్థం గుర్తించడం పెరుగుతుంది.

- ఎడ్మండ్ హేలీ,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

ప్రస్తుతం

రాజధాని కథలో కొత్త ట్విస్టులు



"నిజానికి కేంద్రం సమస్యను దాటవేసింది తప్ప తన అభిప్రాయం గాని, నిర్ణయం గాని చెప్పలేదు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని గతంలో రెండుసార్లు కేంద్రం అఫిడవిట్లు దాఖలు చేసింది. తాజా సమాధానాలలో ఆ అంశం కూడా ప్రస్తావించలేదు. సుప్రీం కోర్టు ముందు కేసు వుంది గనక తానేమీ చెప్పబోనని తప్పించుకుంది. కానీ విశాఖలో జి20 సదస్సులు వంటివి భారీగా నిర్వహిస్తున్నది. అంతకు ముందు ప్రధాని, రాష్ట్రపతి ప్రత్యేక పర్యటనలతో సహా అనేక కీలక కార్యక్రమాలు నిర్వహించి పరోక్షంగా వత్తాసునిచ్చింది. అక్కడ పోటీ చేస్తారనుకుంటున్న బిజెపి నేత జీవిఎల్ నరసింహారావు కూడా ముందే విశాఖ అనుకుని వుంటే బావుండేదని సెలవిచ్చారు. మేము అమరావతికే కట్టుబడి వున్నామని రాష్ట్ర నాయకులతో చెప్పిస్తూ కేంద్రం దాగుడుమూతలు ఆడటం ఒక ఎత్తుగడ."

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అంతులేని కథగా మారాయి. అంతకంతకూ అవే విషయాల చుట్టూ మునిగి తేలుతున్నాయి. రాజధాని కేసులు, ప్రభుత్వ విభిన్న ప్రకటనలూ, ప్రతిపక్షాల విమర్శలకు కారణమవుతూనే మార్పును మింగించే విన్యాసాలుగా గోచరిస్తున్నాయి. మీడియా కథనాలూ అస్పష్టత పెంచుతుంటే తేల్చవలసిన న్యాయస్థానాలు ఆలస్యంతో అయోమయానికి దారి తీస్తున్నాయి. రాష్ట్రం పదేపదే తన వైఖరిని పరిపరివిధాల ప్రకటిస్తుంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవకాశవాదంతో అయోమయం పెంచుతున్నది. అప్పులపై వాదనలూ, ఉద్యోగుల ఉద్యమాలు, ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహాల్లో పాలక వైసీపీ పోకడలూ, ప్రతిపక్ష టిడిపి పాదయాత్రలపై ఆంక్షలూ, ఈ మధ్యలో ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీల మార్పిళ్లు, అడుగడుగునా అసహనంతో నిందారోపణలూ దూషణ భూషణలూ దుర్భరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాలూనడానికి బిజెపి పాట్లు, దానితో జట్టు కట్టిన జనసేన కొత్త జట్టు కోసం వేస్తున్న పిల్లిమొగ్గలూ ఆసక్తికరంగా వున్నాయి. ఈ రాజకీయ ప్రహసనంలో ప్రయోజనం కోసం కులమతాలను కూడగడుతున్న తీరు కూడా ఆందోళనకరంగా మారుతున్నది.

రాజధాని రాజకీయం

ముందుగా రాజధాని రాజకీయం చూద్దాం. అమరాతి నుంచి విశాఖపట్టణానికి రాజధాని తరలింపు తథ్యమని ప్రభుత్వం నుంచో వైసీపీ నుంచో ప్రకటన రాని రోజు దాదాపు లేదు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో వుంది గనక ఏదో ఒక తుది తీర్పు వస్తుందనుకుంటే అది ఆలస్యం అవడం తథ్యంగా కనిపిస్తున్నది. అక్కడ కేసు వుంది గనక... గతంలో తీర్పునిచ్చిన హైకోర్టు కూడా నిరీక్షణలో పడింది. అందరికీ నోటీసులు ఇచ్చి అఫిడవిట్లు కోరిన సుప్రీం ధర్మాసనం ఇంకా లోతైన విచారణ మొదలెట్టవలసే వుంది. వెంటనే విచారణ పూర్తి చేసి తీర్పునివ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా లేఖ రాసింది గాని దాని ప్రభావం కనిపించలేదు. ఈలోగానే ముఖ్యమంత్రి జగన్ దేశ రాజధానిలో మాట్లాడుతూ విశాఖ మా నూతన రాజధాని అనీ, తను అక్కడికే వెళ్లి పాలన చేయబోతున్నానని ప్రకటించారు. ఇది కోర్టు ధిక్కారమని ప్రతిపక్షాలు విమర్శించినా కొందరు కోర్టుకు రాసినా సుప్రీం ఈ నెల మొదట్లో జరిపిన విచారణలో ఆ అంశం లెక్కలోకి తీసుకోలేదు. నిజానికి తాను మాట్లాడింది కోర్టు ధిక్కారం కాదనీ, నేరుగా కోర్టునే అడిగామని సమర్థించుకోవడానికే లేఖ రాశారనే అభిప్రాయం కూడా వుంది. ఈ లోగా కేంద్రం పార్లమెంటులో ఏవో సమాధానాలు ఇచ్చిందనీ, అవి అమరావతినే రాజధానిగా ధృవీకరిస్తున్నాయని కొన్ని మీడియాల్లో ప్రచారం హోరెత్తింది. నిజానికి కేంద్రం సమస్యను దాటవేసింది తప్ప తన అభిప్రాయం గాని, నిర్ణయం గాని చెప్పలేదు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని గతంలో రెండుసార్లు కేంద్రం అఫిడవిట్లు దాఖలు చేసింది. తాజా సమాధానాలలో ఆ అంశం కూడా ప్రస్తావించలేదు. సుప్రీం కోర్టు ముందు కేసు వుంది గనక తానేమీ చెప్పబోనని తప్పించుకుంది. కానీ విశాఖలో జి20 సదస్సులు వంటివి భారీగా నిర్వహిస్తున్నది. అంతకు ముందు ప్రధాని, రాష్ట్రపతి ప్రత్యేక పర్యటనలతో సహా అనేక కీలక కార్యక్రమాలు నిర్వహించి పరోక్షంగా వత్తాసునిచ్చింది. అక్కడ పోటీ చేస్తారనుకుంటున్న బిజెపి నేత జీవిఎల్ నరసింహారావు కూడా ముందే విశాఖ అనుకుని వుంటే బావుండేదని సెలవిచ్చారు. మేము అమరావతికే కట్టుబడి వున్నామని రాష్ట్ర నాయకులతో చెప్పిస్తూ కేంద్రం దాగుడుమూతలు ఆడటం ఒక ఎత్తుగడ.

మూడా? ఒకటా?

ఈ నేపథ్యంలోనే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి మూడు రాజధానులనేది ఒక పొరపాటు భావన అనీ విశాఖనే రాజధాని అనీ బెల్గాంలో వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి అక్కడ మకాం వేసి పాలన చేస్తున్నప్పుడు అదే కీలకమవుతుందని వివరించారు. కర్నూలులో హైకోర్టు ప్రధాన ధర్మాసనం వుంటుందని, గుంటూరులో ఏడాదికో సెషన్ (సమావేశం) జరుగుతుందని కొత్త తరహాలో మాట్లాడారు. వికేంద్రీకరణ కోసం మూడు రాజధానులు అంటూ మొదలు పెట్టిన వైసీపీ సర్కారు నెమ్మదిగా విశాఖనే రాజధాని అనడం ఇటీవల జరుగుతూ వచ్చింది. విశాఖ గర్జన వంటి సందర్భాల్లోనే మనం చూశాం. తర్వాత మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఇక్కడ రాజధాని పెట్టకపోతే మూడు రాష్ట్రాల కోసం పోట్లాడతామనే వరకూ వెళ్లారు. సుప్రీంలో కేసు విచారణ తొలి ఘట్టంలో ప్రభుత్వ న్యాయవాది దుష్యంత్ దవే హైకోర్టు తరలింపు అనేది ఇప్పుడు ఎజెండాలో లేదు (ఇట్ హాజ్ గాన్) అని స్పష్టంగా చెప్పారు. బుగ్గన కూడా ప్రధాన ధర్మాసనం అని మాత్రమే అన్నారు. అమరావతి శాసన రాజధాని అన్నది కాస్తా ఒక సెషన్‌గా మార్చారు. సహజంగానే ఇవన్నీ విమర్శలకు, సందేహాలకు దారితీశాయి. ఈ విషయమై వివరణ ఇచ్చిన ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వీటి మధ్య తేడాలేదంటూ తమ విధానాన్ని పునరుద్ఘాటించారు. వీరెవరూ మూడు రాజధానుల విధానంతో విభేదించనప్పుడు సమస్యేమిటని ఎదురుదాడి చేశారు. కాని ముఖ్యమంత్రితో సహా అందరూ విశాఖపట్టణమే రాజధాని అంటున్నారు, సుప్రీం కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే ఎలా వంటివాటిపై సూటిగా సమాధానం లేదు. అక్కడ తీర్పు ఒకరకంగా వస్తే ఒక విధంగా మరో రకంగా వస్తే మరో విధంగా ముఖ్యమంత్రి వెళ్లడం జరుగుతుందని మాత్రం చెప్పారు. ఏమంటే అనుకూల తీర్పు వస్తే మొత్తంగా తరలిపోతారు, వ్యతిరేకంగా వస్తే వ్యక్తిగతంగా ఆయన వెళ్లి పాలన సాగిస్తారు అని దీని అర్థం. ఇది నైతికంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందా అనేదానికంటే మా విధానం అదే అన్నది ఆయన భావంగా వుంది.

రాజ్యాంగంలో రాజధాని భావనే స్పష్టంగా పొందుపర్చకపోవడం, ఆ బాధ్యత కేంద్రానిదా రాష్ట్రానిదా అనేది ఇదమిద్ధంగా లేకపోవడం ఒక వాస్తవం. విభజన చట్టంలో 'ఎ క్యాపిటల్' అన్నారు గనక పార్లమెంటు చట్టం ప్రకారం ఇది ఏర్పాటయిందని ప్రతివాదులు చేసే వాదన పట్ల సుప్రీంకోర్టు ఏ వైఖరి తీసుకుంటుందో తెలియదు. అయితే ముఖ్యమంత్రి ఎక్కడ కూచుంటే అదే రాజధాని అన్న వాదన మరీ విపరీతమైంది. ఉదాహరణకు 2015లో అమరావతిని రాజధానిగా చేసిన నోటిఫికేషన్ మార్చకుండా విశాఖను రాజధాని అనడం సాధ్యమవుతుందా? పరిపూర్ణ చట్టబద్ధత లేకుండా కేవలం ఆయన పీఠం మార్చి విశాఖను ఊరించడం, మురిపించడం వల్ల ప్రయోజనమేమిటి? అందరూ అంగీకరించినప్పటికీ హైకోర్టును కర్నూలుకు తరలించడం ఎందుకు వెనక్కుపోయింది? బుగ్గన ప్రకటనలో ప్రధాన ధర్మాసనం అనే మాట వాడాల్సిన అవసరమేమిటి? శాసన రాజధాని (ఇప్పటికి న్యాయ రాజధాని కూడా) అని పేర్కొన్న అమరావతిలో (లేదా గుంటూరు జిల్లాలలో) ఇప్పుడు ఒక సెషన్ అనడం దేనికి సంకేతం? పైగా హైకోర్టులో సదుపాయాలు పెంచుతామని కూడా సుప్రీం కోర్టు జడ్జిలకు హామీ ఇచ్చారు కదా! సచివాలయం ఎక్కడుంటే అదే రాజధాని అని బిజెపి జీవీఎల్ చెప్పిన దానికి ముఖ్యమంత్రి తరలిపోతారని వైసీపీ చెబుతున్నదానికి ఏదైనా సంబంధం వుందా? అమరావతిలో యథాతథ స్థితి వుండాలని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది గనక వున్నవాటిని తాకకుండా విశాఖలో కొత్త ఏర్పాటు చేసుకుంటున్నారా? ఇప్పటికే ఆదేశాలు వచ్చాయనీ, నివాసాలు కార్యాలయాల కోసం స్థలాలు భవనాలు సిద్ధమవుతున్నాయని వచ్చే వార్తలు అవేనా? ఈ ప్రశ్నలు వేటికీ వైసీపీ నేతలు స్పష్టమైన సమాధానాలివ్వరు. విశాఖ వెళ్లడం ఖాయం అని మాత్రం చెబుతుంటారు. ఇటీవలి కాలంలో టిడిపి, జనసేన, బిజెపి కూడా నెమ్మదిగా విశాఖలో కార్యకలాపాలు పెంచాయి. దాన్ని ఆర్థిక రాజధాని చేస్తామని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కూడా ప్రకటించారు. ఈ పార్టీల మధ్య వాదోపవాదాలలో అమరావతి గురించిన అంశాలు తగ్గి ఇతర వివాదాలు పెరిగాయి. ఈ మధ్యనే జనసేన విశాఖపై రెఫరెండంకు వెళదామా అని అడిగినప్పుడు మాది అదే విధానమని ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు. అయితే కేంద్రం దాగుడుమూతలను వీరెవరూ ప్రశ్నించలేదు. ఎన్నికల సమయంలో అన్ని ప్రాంతాలనూ సంతృప్తిపర్చాలి గనక వ్యూహాత్మకంగానే దీన్ని అమరావతి జెఎసికీ, కోర్టులో కేసులకూ పరిమితం చేశారా అనే సందేహం ప్రజలలో నెలకొంది. ముఖ్యమంత్రి ఎక్కడ ఎన్ని రోజులు వుంటారనేది ఒకటైతే అమరావతిలో అసంపూర్ణంగా వదిలేసిన పనులు, ప్రతిష్టంభన తొలిగించి నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది. న్యాయస్థానాలు కూడా ఇందుకు అనుగుణమైన ఆదేశాలిస్తాయని ఆశిద్దాం. కేంద్రం కూడా దాటవేతలు, దాగుడుమూతలు విరమించి సూటిగా సహకారమందించాల్సి వుంటుంది.

అప్రజాస్వామికత తప్పు

మొదటే చెప్పినట్టు తక్షణం రానున్న ఎంఎల్‌సి ఎన్నికలలో ప్రజల కోసం పోరాడి విజయం సాధిస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాల నాయకులను ఓడించేందుకు వైసీపీ పెద్ద ఎత్తున రంగంలోకి దిగడం కొత్త పరిణామం. సవ్యంగా పోరాడితే పర్వాలేదు గాని ఓటర్ల నమోదు నుంచి ఉపాధ్యాయులలో అధికారుల ప్రచారం వరకూ అనేక అవకతవకలకు పాల్పడడం దారుణం. చివరకు విద్యాశాఖ ఆర్జెడిపై చర్య తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలివ్వాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతిపక్ష నేతలు యాత్రలపై ఆంక్షలు, అరెస్టులు, కేసులు అవాంఛనీయం. అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబు పట్ల, మాజీ మంత్రి జవహర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికతకు పరాకాష్టగా వుంది. దళిత సంఘాలు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం వంటివి సహించలేని విషయం ఇది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రజల్లోకి వెళ్లి తమ భావాలు చెప్పుకోవాలి. ప్రభుత్వ తప్పిదాలపై పోరాడాలి. ఎంత మెజార్టీ వున్నా ఇది కూడా సహించలేకపోవడం పెద్ద తప్పిదం. రాజధాని విషయంలోనూ ఇదే ఏకపక్ష ధోరణి. ఇప్పటికైనా వైసీపీ సర్కారు తీరు మారాలి. ★



తెలకపల్లి రవి

విశ్లేషణ

ఆద్యంతం అక్రమాలు, ఉల్లంఘనలే!

(నిన్నటి సంచిక తరువాయి)


ఎక్కడ బడితే అక్కడ అదానీ సంస్థలు పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించిన ఉదంతాలు కోకొల్లలు. మోడీ అధికారంలోకి రాగానే ఆ ఉల్లంఘనలన్నీ మాఫీ అయిపోయాయి. ముంద్రా ప్రాజెక్టు మీద కేంద్రం గతంలో విధించిన అపరాధ రుసుం ఉత్తర్వు గుట్టు చప్పుడు కాకుండా రద్దు అయిపోయింది. అటవీ భూముల సరిహద్దులను అదానీకి అనుకూలంగా తిరిగి నిర్వచించడానికి వీలుగా గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శిని తొలగించారు. దాంతో ఛత్తీస్‌గఢ్ లోని బొగ్గు గనుల ప్రాజెక్టుకు అదానీకి అడ్డంకులు తొలగిపోయాయి.

ఆస్ట్రేలియా లోని క్వీన్స్‌ల్యాండ్ ప్రాంతంలో వివాదాస్పదంగా ఉన్న ఒక బొగ్గు గని వ్యవహారంలో ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెడలు వంచి రుణం కోసం ఒప్పందం మీద సంతకాలు చేయించిన వైనం చూస్తే ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా ఏవిధంగా వాడుకున్నదీ కనిపిస్తుంది. ఆ బొగ్గు గని తవ్వకాల ప్రాజెక్టు, అక్కడి నుండి ఒక ఓడరేవు వరకూ ప్రతిపాదించిన ఒక రైల్వే లైను, ఆస్ట్రేలియా ఖండాన్ని ఆనుకుని ఉన్న గ్రేట్ బారియర్ రీఫ్ (సముద్రంలో ఉన్న పగడాల నిక్షేపాలు)కు, సంబంధిత పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా ఉన్నాయి. అందుకే ప్రపంచంలోని ప్రధాన బ్యాంకులన్నీ ఆ ప్రాజెక్టుకు రుణం ఇవ్వడానికి నిరాకరించాయి. అంతిమంగా ఆ ప్రాజెక్టు ప్రతిపాదన అటకెక్కింది. దాంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణ ప్రతిపాదన కూడా మూతబడింది.

ఆర్థిక నేరాలను అరికట్టడానికి ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ విభాగం డిఆర్‌ఐ అదానీ గ్రూపు యంత్ర భాగాల దిగుమతిలో పాల్పడిన అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపి డిసెంబరు 2013లో ఒక నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం అదానీ గ్రూపు రూ. 2322.75 కోట్ల మేరకు ఆ లావాదేవీల ద్వారా మాయం చేసింది. కాని మోడీ ప్రభుత్వం ఆ నివేదికను చల్లగా తొక్కిపెట్టింది.

అదానీ గ్రూపు పాల్పడుతున్న అక్రమాల గత చరిత్ర గురించి తెలిసినప్పటికీ వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవలసిన నియంత్రణ సంస్థలు సెబి, కంపెనీ వ్యవహారాల శాఖ పూర్తిగా ఉపేక్షించాయి. ఇది అన్నింటికన్నా పెద్ద తప్పు. వినోద్ అదానీ (గౌతమ్ అదానీ సోదరుడు) మారిషస్ లో 38 డొల్ల కంపెనీలను అక్రమంగా నిర్వహిస్తున్న సంగతి ఆ నియంత్రణ సంస్థలకు తెలుసు. ఈ 38తో బాటు సైప్రస్‌లో, యుఎఇ లో, సింగపూర్ లో వినోద్ అదానీ నడుపుతున్న డొల్ల కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు నిర్వహిస్తున్న లావాదేవీలు ఏమీ లేవు అన్న సంగతి కూడా స్పష్టమే. అన్ని కంపెనీలకూ ఒకే అడ్రసులు ఇచ్చారు. బహిరంగంగా కనిపించే ఏ విధమైన సేవలనూ ఈ సంస్థలు అందించడం లేదు. అదానీ స్వంత కంపెనీల షేర్లను వీటి పేరుతో నిర్వహించడానికి, వాటి ధరలను తారుమారు చేయడానికి ఈ డొల్ల కంపెనీల పేర్లను ఉపయోగించారు. ఈ కంపెనీలన్నీ కాగితాలకే పరిమితం.

తక్కిన పెద్ద కార్పొరేట్ కంపెనీలతో పోల్చితే అదానీ గ్రూపు సంస్థలకు ఒక ప్రత్యేకత ఉంది. తమకున్న రుణాల వాయిదాలను చెల్లించడానికి కావలసిన ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోవడమే ఆ ప్రత్యేకత. అదానీకి ఉన్న లిస్టెడ్ కంపెనీలు ఏడింట్లోనూ అయిదు కంపెనీలు ఒక శాతం కన్నా తక్కువ లాభాన్ని ఆర్జిస్తున్నాయి. ఆ కంపెనీలను నిర్వహించే ఉన్నత స్థాయి అధికారులు 25 మందిలో 8 మంది అదానీ కుటుంబ సభ్యులే. దాంతో అదానీ గ్రూపు సంస్థల వ్యవహారం అంతా ఒక కుటుంబ వ్యవహారం అని స్పష్టం ఔతోంది. ఈ సంస్థల నిర్మాణం ఏ విధంగా ఉందంటే దాని వలన ఇన్‌సైడర్ ట్రేడింగ్ (షేర్ల కొనుగోలులో ఒక అక్రమ పద్ధతి) రౌండ్ ట్రిప్పింగ్ (ఒక కంపెనీ ఆస్తులను ఇంకొక డొల్ల కంపెనీకి విక్రయించినట్టు కాగితాలమీద చూపించి పన్నులు ఎగ్గొట్టడం), కృత్రిమంగా షేర్ల ధరలను తారుమారు చేయడం వంటి అక్రమాలకు పాల్పడడం తేలికగా చేయవచ్చు. స్టాక్‌మార్కెట్ నియమాల ప్రకారం ఈ తరహా పద్ధతులన్నీ చట్టవిరుద్ధం. అదానీ గ్రూపు సంస్థలు విదేశాలలో సాగించిన లావాదేవీలపై సెబి దాదాపు ఏడాదిన్నర పాటు విచారణ జరిపింది. ఈ విషయాన్ని సెబి స్వయంగా ధృవీకరించింది. అదానీ గ్రూపు విదేశాల్లో నియంత్రించే నిధులలో దాదాపు 90 శాతం ఈ గ్రూపు కంపెనీల్లోనే తిరిగి పెట్టుబడులు పెడుతున్నారు. ఈ సంస్థలు నడిపే కార్యకలాపాల తీరును పరిశీలించే వారికెవరికైనా ఇందులో అక్రమాలు జరుగుతున్న విషయం తేలికగానే అర్థం అవుతుంది. ఇందుకు వేరే ఏ నిపుణుల పరిశీలనా అవసరం లేదు. ప్రభుత్వపు అత్యున్నత స్థాయిలో వీటిని ఉపేక్షించడం వల్లనే ఇవన్నీ సాధ్యపడ్డాయి.



"అదానీ గ్రూపు పాల్పడుతున్న అక్రమాల గత చరిత్ర గురించి తెలిసినప్పటికీ వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవలసిన నియంత్రణ సంస్థలు సెబి, కంపెనీ వ్యవహారాల శాఖ పూర్తిగా ఉపేక్షించాయి. ఇది అన్నింటికన్నా పెద్ద తప్పు. వినోద్ అదానీ (గౌతమ్ అదానీ సోదరుడు) మారిషస్ లో 38 డొల్ల కంపెనీలను అక్రమంగా నిర్వహిస్తున్న సంగతి ఆ నియంత్రణ సంస్థలకు తెలుసు. ఈ 38తో బాటు సైప్రస్‌లో, యుఎఇ లో, సింగపూర్ లో వినోద్ అదానీ నడుపుతున్న డొల్ల కంపెనీలు ఉన్నాయి. అదానీ స్వంత కంపెనీల షేర్లను వీటి పేరుతో నిర్వహించడానికి, వాటి ధరలను తారుమారు చేయడానికి ఈ డొల్ల కంపెనీల పేర్లను ఉపయోగించారు. ఈ కంపెనీలన్నీ కాగితాలకే పరిమితం."

బోరిస్ జాన్సన్, నైగెల్ ఫారగె, డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోడీ, బోల్సనారో, ఎర్డొగాన్ వంటి నాయకులను ఒకప్పుడు వారి వారి దేశాల ప్రజలు ఆమోదించే పరిస్థితి ఉండేదే కాదు. కాని ఇప్పుడు అటువంటి పచ్చి మితవాద నాయకులే ఆ యా దేశాలలో తిరుగులేని అధినేతలుగా చెలామణీ ఔతున్నారు. ఎందువలన? ఆ యా రంగాలలో నిపుణులైన వారు ఒకప్పుడు అధిష్టించిన అధికార పదవులలో ఈ వాగాడంబర నేతలు ఏ విధంగా చొరబడ్డారు?

ప్రపంచవ్యాప్తంగా పచ్చి మితవాద శక్తులు పైచేయి సాధించిన వైనాన్ని గార్డియన్ పత్రిక కాలమిస్టు జార్జి మాబియట్ ఈ విధంగా వివరించారు: "పెట్టుబడిదారీ వ్యవస్థ పనిచేసే తీరు మారింది. 1990 దశకంలోను, 2000 దశకంలోను కార్పొరేట్ శక్తి పైచేయి కలిగి వుండేది. వాళ్ళకి టెక్నోక్రాట్లు అవసరం. ఒక వైపు ప్రభుత్వాన్ని సమర్ధవంతంగా, భద్రంగా నడిపిస్తూనే, మరోపక్క కార్పొరేట్ల లాభాలను కాపాడగలిగేటట్టు వ్యవహరించే నాయకులు వారికి అప్పుడు అవసరం అయ్యారు. కాని ఇప్పుడు ఆ కార్పొరేట్ శక్తి పరిణామం చెందింది. కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో సమస్త అధికారాలూ కేంద్రీకరించబడి వుండే పద్ధతిగా మారిపోయింది." (ఆలిగార్కీ)

ఈ పచ్చి మితవాద నాయకుల ఆలోచనా క్రమాన్ని వివరిస్తూ "వీళ్ళు పాలనా వ్యవస్థ మొత్తాన్ని కూలదోయాలనుకునే ధోరణితో వ్యవహరిస్తారు" అని స్టీవ్ బానన్ అనే సిద్ధాంతవేత్త అన్నాడు. "ఈ 'వినాశకర' పెట్టుబడిదారీ విధానంలో లాభాలు ఇబ్బడి ముబ్బడిగా రావాలంటే పూర్తి అరాచకత్వం నెలకొనాలి. దాని వల్లనే కొత్త శతకోటీశ్వరులు వర్ధిల్లుతారు. ప్రతీ ఘర్షణనూ ఉపయోగించుకుని ప్రజల ఉమ్మడి ఆస్తులను వీళ్ళు తేలికగా చేజిక్కించుకుంటారు" అని ఆయన అన్నాడు.

ఈ తరహా నాయకులు అసలు సమస్యల్ని పక్కదోవ పట్టించడంలో సిద్ధహస్తులు. ఒకపక్క దోపిడీదారులు అధికారుల కుమ్మక్కుతో ప్రజల్ని కొల్లగొడుతూ వుంటే, ఈ నాయకులు వేరే ఏదో విషయం మీద చర్చ లేవనెత్తుతారు. శతకోటీశ్వరుల మీదకు మళ్ళించవలసిన ప్రజాగ్రహాన్ని మైనారిటీ సమూహాలమీదకు మళ్ళిస్తారు. వారిని బలిపశువుల్ని చేస్తారు. "ఈ కొత్త తరహా వాగాడంబరం ఒక మోసం. పెట్టుబడిదారీ దోపిడీ ప్రభావం వైపు నుండి దృష్టిని మళ్ళించడం. దీనికి పెట్టుబడిదారుల అండదండలు పుష్కలంగా ఉంటాయి."

ఈ కొద్దిమంది సంపన్న వ్యక్తుల దృష్టి ఎంతసేపూ విదేశాలలో తమ అక్రమ ఆర్జనకు ఆశ్రయం కల్పించే దేశాల మీదే ఉంటుంది. మరోవైపు అతిగా ప్రకటించుకునే జాతీయతావాదం ద్వారా మాత్రమే వీరి ప్రయోజనాలను కాపాడుకోజూస్తారు. ఈ విధంగా తమ దేశ భక్తిని అతిగా ప్రకటించుకుంటూ, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడమే పరమావధిగా చెప్పుకునే ఈ మితవాద రాజకీయ నాయకులే దేశ సంపదను అమ్మివేయడంలో అందరికన్నా ముందుంటారు.

అన్ని శిక్షలకూ తాము అతీతం అనే ధోరణి ఎక్కడి నుంచి పుట్టుకొచ్చింది?

2014లో మోడీ ప్రధాని అయ్యేనాటికి ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ 609వ స్థానంలో ఉన్నాడు. 2022 సంవత్సరాంతానికి అతను 2వ స్థానానికి చేరాడు. మితిమీరిన వేగంతో సాధించిన ఈ అభివృద్ధి సహజంగానే ప్రపంచవ్యాప్తంగా లోతైన పరిశీలనకు దారి తీస్తుంది. "అన్నింటికీ తాము అతీతం" అనే ధోరణితో అదానీ గ్రూపు వ్యవహరించినట్టు అనిపిస్తున్నదని హిండెన్‌బర్గ్ నివేదిక పేర్కొంది. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోను, ఆ తర్వాత 2014లో దేశ ప్రధాని అయిన తర్వాత అదానీ పెరిగిన తీరు చూస్తే ఇది వాస్తవం అని ఒప్పుకోవలసినదే.


బిజెపి కి ప్రత్యర్థులుగా ఉన్నవారిని ధనబలంతో కొనుగోలు చేయడంలోను, స్వతంత్ర సంస్థలుగా వ్యవహరించవలసిన ఐ.టి, ఇ.డి, సిబిఐ తదితర సంస్థలను తప్పుడు పద్ధతుల్లో ఉపయోగించడం ద్వారా వారి మీద ఒత్తిడి తేవడంలోను మోడీ ప్రభుత్వం ఇప్పటికే పేరు గడించింది. ఈ తరహా పద్ధతుల ద్వారానే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసి తమవైపు తిప్పుకోగలిగారు. అదే విధంగా ఐ.టి, ఇ.డి, సిబిఐ వంటి సంస్థలను ఉపయోగించి కొన్ని కంపెనీల ఆస్తులను అదానీ కొనుగోలు చేయగలిగాడు. 2018 అక్టోబర్ 10న ఐటి శాఖ కృష్ణపట్నం పోర్టు మీద, నవయుగ సంస్థ ఆఫీసుల మీద దాడులు చేసింది. 2020 అక్టోబర్ 6న అదానీ కృష్ణపట్నం పోర్టులో 75 శాతం వాటాలు చేజిక్కించుకున్నాడు. 2021 ఏప్రిల్ 6 కల్లా అదానీ అందులో 100 శాతమూ పొందగలిగాడు. 2020 డిసెంబర్ 10న సిబిఐ ఎసిసి, అంబుజా సిమెంట్స్, అల్ట్రా టెక్ కంపెనీల మీద దాడులు చేసింది. 2022 అక్టోబర్ 16న అదానీ ఎసిసి, అంబుజా సిమెంట్స్ కంపెనీల వాటాలను కొనుగోలు చేయగలిగాడు. 2020 జులై 2న జివికె సంస్థ యాజమాన్యం మీద, జివికె ముంబై విమానాశ్రయం మీద ఎఫ్‌ఐఆర్ లను సిబిఐ నమోదు చేసింది. 2020 జులై 18న ముంబై, హైదరాబాద్ లలోని జివికె ఆఫీసులమీద దాడులు చేసింది. 2020 ఆగస్టు 31న జివికె సంస్థ ముంబై విమానాశ్రయాన్ని అదానీకి అమ్మివేసింది. ఈ పరిణామాలు జరిగిన క్రమాన్ని పరిశీలించినప్పుడు విషయం తేటతెల్లం కావడం లేదా?

ఇక విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఉదంతం చూస్తే వికారం కలుగుతుంది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా యాజమాన్యం కింద నడిచే విమానాశ్రయాలన్నీ దాదాపు ఇప్పుడు అదానీ హస్తగతం అయిపోయాయి. ఆ వైనం చూస్తే కళ్ళు బైర్లు కమ్ముతాయి. ఆ కథనంతటినీ వివరించడానికి ఇక్కడ స్థలం సరిపోదు. తిరువనంతపురం విమానాశ్రయం మీద అదుపు కోసం కేరళ లోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం తన ప్రభుత్వ సంస్థ ద్వారా ప్రయత్నించిన సందర్భంలో అదానీ గుత్తాధిపత్యం కోసం ఎంతదాకా పోతాడో తేటతెల్లం అయ్యింది.

ఎల్‌ఐసి, ఎస్‌బిఐ వంటి ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుండి నిధులను అదానీ పొందిన తీరు గురించి కూడా ఇక్కడ గుర్తు చేసుకోవాలి. గత కొన్ని రోజులుగా ఈ చౌకీదార్ ప్రభుత్వపు ఆర్థిక మంత్రి గాని, ప్రధాని గాని ఈ ఉదంతం మీద నోరు విప్పడం లేదంటే ఈ విషయంలో ప్రభుత్వం ఎటువంటి ఇరకాటంలో పడిందో బోధపడుతోంది.

(ముగింపు తదుపరి సంచికలో)

(స్వేచ్ఛానువాదం)



నీలోత్పల్ బసు



అభివాదం చేస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



జనరల్ కౌన్సిల్‌కు ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

ఉపాధి హామీకి నిధులు పెంచండి

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ డిమాండ్

జ్యోతిబసునగర్ (హౌరా) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు హౌరాలో జరుగుతున్న అఖిలభారత మహాసభలో శనివారం నాడు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో 2006లో ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. 2010 నాటికి దేశవ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇది అమలైందని వివరించారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీకి నిధులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. గత బడ్జెట్లో 73 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే ఈ ఏడాది 60 వేల కోట్లకు తగ్గించారని వివరించారు. వాస్తవంగా ఉపాధి కరువైన సమయంలో నిధులు పెంచాల్సింది పోయి తగ్గించారని పేర్కొన్నారు. ఎక్కువ కుటుంబాలకు 50 రోజులు పని కూడా ఉండటం లేదని తీర్మానంలో పేర్కొన్నారు. నెలవారీ ఆర్థిక ఖర్చులు పెరిగాయని, దానికి అనుగుణంగా పెరుగుదల ఉండాలని చెప్పారు. జనవరి 2020 నుండి అక్టోబర్ 2022 మధ్యలో 14 మిలియన్ల ఉమంది ఉపాధి కోల్పోయారని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి నివేదిక తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద 100 నుండి 150 రోజుల పని కల్పించాలని, కేరళ మాదిరి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ఏర్పాటు కోసం ఉద్యమించాలని తీర్మానించారు.

దళితులపై దాడులు అరికట్టండి

దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు చేసిన తీర్మానంలో బిజెపి అధికారంలలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా దాడులు పెరిగాయని పేర్కొంది. కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాల్లో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని తెలిపింది. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో నివేదికల ప్రకారం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే ఈ తరహా దాడులు పెద్దఎత్తున జరుగుతున్నాయని తెలిపింది..

బెంగాల్ పోరాటానికి సంఘీభావం

తృనమూల్, బిజెపి దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న బెంగాల్‌లోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు మహాసభ సంఘీభావం ప్రకటించింది. ఈ పోరాటాన్ని కాపాడుకుని,ముందుకు తీసుకుపోవడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపింది. తృణమూల్, బిజెపి దాడుల్లో మృతిచెందిన అమరులకు మహాసభ నివాళు లర్పించింది.

. వైద్య ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచండి

దేశంలో కరోనా అనంతరం వైద్య ఆరోగ్య రంగ ప్రాధాన్యత తెలిసిందని, ఈ నేపథ్యంలో ఈ రంగాన్ని మెరుగుపరచడంతోపాటు బడ్జెట్లో నిధులు కూడా పెంచాలని కోరుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు.

ప్రతినిధుల సంఖ్య పెంపు

మహాసభ ప్రతినిధులను 151 నుండి 161 పెంచుతూ నిబంధనల్లో మార్పు చేశారు. గుజరాత్, పాండిచ్చేరి, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ప్రతినిధులు రావడం, మహిళల ప్రాతినిధ్యం పెంచాల్సి ఉండటంతో ఈ మార్పు చేసినట్లు వివరించారు. అఖిలభారత వ్యవసాయ కార్మికసంఘం కోసం రూపొందించిన వెబ్‌సైట్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యులు విజయరాఘవన్ ప్రారంభించారు.

అతి చిన్న వయసు ప్రతినిధి శరత్‌చంద్ర



-మహాసభల చివరిరోజు మహాసభల అర్హతల వివరాలను స్టీరింగ్ కమిటీ సభ్యులు విక్రమ్ ప్రవేశపెట్టారు. ఈ మహాసభకు 695 మంది హాజరయ్యారు. వీరిలో 637 మంది ప్రతినిధులు, 47 మంది కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 119 మంది పరిశీలకులుగా ఉన్నారు. వీరిలో 566 మంది పురుషులు, 119 మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు. వీరిలో ఎపికి చెందిన శరత్‌చంద్ర అతి పిన్నయస్కుడు కాగా, సునీత్ కృష్ణచంద్ర చోప్రా సీనియర్ ప్రతినిధిగా నిలిచారు. ప్రతినిధుల్లో 321 మంది వ్యవసాయ కార్మిక రంగం నుండి రాగా, 368 మంది పూర్తికాలం కార్యకర్తలుగా ఉన్నారు. బెంగాల్‌కు చెందిన సచీంద్రానంద్‌రాయ్ ఏడు సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారు. ఏడాదిపైన 11 మంది, రెండేళ్లపైగా 11 మంది మూడేళ్లకుపైగా ఏడుగురు, ఐదేళ్లకుపైగా జైలు జీవితం గడిపారు.



సునీత్ కృష్ణచంద్ర చోప్రా

న్యాయం జరిగే వరకూ పోరాడతాం

- ఘట్‌మీక మృతుల కుటుంబాలకు సిపిఎం పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బృందాకరత్

న్యూఢిల్లీ : బజరంగ్‌దళ్ గోగూండాల చేతిలో అపహరణకు, దారుణ హత్యకు గురైన ఇద్దరు ముస్లిం యువకుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తెలిపారు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా పహరి తాలుకా ఘాట్‌మీకకు చెందిన నసీర్ (25), జునైద్ అలియాస్ జునా (35)లను హర్యానాలో కారులో సజీవ దహనమైన సంగతి తెలిసిందే. ఆ గ్రామాన్ని సిపిఎం ప్రతినిధి గురువారం సందర్శించింది. ఈ బృందంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, రాజస్థాన్ పార్టీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు అమ్రా రామ్, రాజస్థాన్ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుమిత్రా చోప్రా, డాక్టర్ సంజయ్ మాధవ్, రైసా, న్యాయవాది షబ్బీర్‌ఖాన్ ఉన్నారు. జునైద్, నసీర్ కుటుంబ సభ్యుల్ని బృందం పరామర్శించింది. జునైద్ వ్యవసాయ కార్మికుడుగానూ, నసీర్ ట్రక్కు డ్రైవర్‌గా పనిచేసేవారని బృందం గుర్తించింది. జునైద్‌కు ఆరుగురు పిల్లలు ఉంటడంతో పాటు, మానసిక వైకల్యంతో బాధపడే తన సోదరుడి కుటుంబాన్ని కూడా చూసుకునే వాడు. నసీర్ దంపతులకు పిల్లలు లేకపోయినా తన తోబుట్టువులకు మద్దతుగా ఉండేవాడు. వారి హత్య ఆయా కుటుంబాలను ఆందోళనకు గురి చేసిందని, వారికి తక్షణ సహాయం అవసరమని బృందం గుర్తించింది.

అక్రమ రవాణా పేరుతో తప్పుడు కేసులు

'గోవుల అక్రమ రవాణా' పేరుతో జునైద్‌పై కొన్నేళ్ల క్రితం నమోదైన కేసుల గురించి సిపిఎం బృందం ఆరా తీసింది. సమీపగ్రామాల్లో కొంతమందిపై ఇలాంటి నమోదయ్యాయి. ఆ ఆరోపణలపై సాక్ష్యాలేమీ లేకపోవడంతో జునైద్‌ను ఎప్పుడూ అరెస్టు కూడా చేయలేదు. పశువుల పెంపకందారులపై, వ్యాపారులపై గో గూండాల దాడులను సమర్థించేందుకు ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులుగా బృందం వీటిని గుర్తించింది. ముస్లిం మతానికి చెందిన పాడి రైతులు, పశువుల వ్యాపారులను గోహంతకులు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2017 నవంబర్‌లో ఇదే గ్రామానికి చెందిన పశువుల వ్యాపారి ఉమర్‌ఖాన్‌ను గోగూండాలు కాల్చి చంపారు. దీనికి కొన్ని నెలల ముందు పాడి రైతు పెహ్లూఖాన్‌నూ దారుణంగా హత్య చేశారు. ఇప్పటికీ వీరి కుటుంబాలకు న్యాయం జరగలేదు. ప్రస్తుతం హత్యకు గురైన జునైద్, నసీర్ కుటుంబాలకూ న్యాయం జరిగే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కేసులో ఇప్పటి వరకూ కిడ్నాప్ అభియోగాలను మాత్రమే పోలీసులు నమోదు చేశారు. ఇంకా హత్యకు సంబంధించిన సెక్షన్లు చేర్చలేదు. మృతదేహాలు ఉన్న కాలిపోయిన వాహనాన్ని హర్యానాలోని లోహారు గ్రామంలో గుర్తించారు. కాబట్టి ఈ కేసు విచారణలో హర్యానా పోలీసుల సహకారం అవసరం.

నేరస్తులను తక్షణం అరెస్టు చేయాలి : సిపిఎం

ఈ కేసులో రాజస్థాన్ ప్రభుత్వం దృఢంగా వ్యవహరించడం చాలా అవసరమని సిపిఎం బృందం పేర్కొంది. రాజస్థాన్‌లోనే కిడ్నాప్ అనే ప్రాథమిక నేరం జరిగింది కాబట్టి ఎలాంటి జాప్యం లేకుండా నేరస్థులను అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేసింది. గతంలో కన్హయ్యలాల్ హత్య కేసులో మాదిరిగానే బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం, ఉద్యోగం కల్పించాలని కోరింది. ఈ దారుణ హత్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. గో గూండాల నేరాలకు హర్యానా ప్రభుత్వం, పోలీసుల ప్రోత్సాహమే కారణమని విమర్శించింది. రాజస్థాన్ ప్రభుత్వం కూడా ఈ కేసులో రాజస్థాన్ పోలీసుల పాత్రపై వెంటనే జరపాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లతో ముఖ్యమంత్రికి త్వరలో సిపిఎం వినతిపత్రం ఇవ్వనుంది.

ఎఐకెఎస్ దిగ్భ్రాంతి

రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు యువకులను గోగూండాలు సజీవ దహనం చేయడంపై అఖిల భారత్ కిసాన్ సభ (ఎఐకెఎస్) దిగ్భ్రాంతిని, తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. హర్యానా పోలీసులు నిర్లక్ష్యంతోనే ఈ దారుణం జరిగిందని విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఇది సాధారణంగా జరిగిన సంఘటన కాదని, ఇటీవల కాలంలో మేవాత్ ప్రాంతంలో గో గూండాల చేస్తున్న వరస హత్యల్లో ఒకటని తెలిపింది. హర్యానాలో గౌ వంశ్ సంరక్షణ, గౌ సంవర్ధన్ చట్టం 2015 పేరుతో క్రూరమైన చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి గో గూండాలు రెచ్చిపోతున్నారని తెలిపింది.

మోడీ బానిసగా ఎన్నికల సంఘం: ఉద్ధవ్

ముంబయి : ఎన్నికల కమిషన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బానిసగా మారిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే విమర్శించారు. ఏక్‌నాథ్ షిండేదే అసలైన శివసేన అని ఎన్నికల కమిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విల్లు, బాణం గుర్తును కూడా షిండే గ్రూపునకే కేటాయించింది. తమ నివాసం మాతోశ్రీ వద్దకు భారీగా చేరిన కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి ఉద్ధవ్ థాకరే శనివారం మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఇప్పుడు చేసింది, గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు. పార్టీ చిహ్నం దొంగలించబడిందని, 'దొంగ'కు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇసి నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు.

మరో 12 చీతాలు రాక

- కునో నేషనల్ పార్క్‌లో వదిలిపెట్టిన మధ్యప్రదేశ్ సిఎం

గ్వాలియర్ : దక్షిణాఫ్రికాతో ఒప్పందంలో భాగంగా 12 చీతాలు శనివారం భారత్ చేరుకున్నాయి. వీటిని తీసుకుని జోహన్నెస్‌బర్గ్ నుంచి బయల్దేరిన వాయుసేనకు చెందిన సీ-17 విమానం శనివారం ఉదయం గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో దిగింది. అక్కడి నుంచి ఈ చీతాలను హెలికాప్టర్లలో శ్యోపూర్ జిల్లాలోని కునో జాతీయ పార్కుకు తరలించారు. ఈ మధ్యాహ్నం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ వీటిని కునో నేషనల్ పార్క్‌లో విడుదల చేశారు. ఇందులో ఏడు మగ, అయిదు ఆడ చీతాలున్నాయి. వీటి కోసం కునో పార్కులో పది క్వారంటైన్ ఎన్‌క్లోజర్లను సిద్ధం చేశారు. 1948లో అప్పటి ఉమ్మడి మధ్యప్రదేశ్ ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొరియా జిల్లాలో చివరి చీతా చనిపోయిన తర్వాత దేశంలో వీటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. వీటిని అంతరించిన జాతిగా 1952లో ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో అంతరించిపోయిన ఈ వన్యప్రాణి జాతిని పున్ణప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ చీతా'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా నమీబియా నుంచి 8 చీతాలను ప్రత్యేక విమానంలో తీసుకొచ్చి కునో నేషనల్ పార్క్‌కు తరలించారు. గతేడాది సెప్టెంబరు 17న తన పుట్టినరోజున ప్రధాని మోడీ వీటిని పార్కులో విడిచిపెట్టారు.

కరాచీ పోలీస్ స్టేషన్‌పై ఉగ్రదాడి..

ఐదుగురు పాక్ తాలిబన్ ఉగ్రవాదులు సహా 9 మంది మృతి

కరాచీ : పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పోలీస్ చీఫ్ హెడ్ ఆఫీస్ భవనంపై తెహ్రీక్-ఇ-తాలిబాన్ (పాకిస్థాన్)కి చెందిన ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ సందర్భంగా భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు, ఓ పౌరుడు, రేంజర్ సిబ్బంది ఉన్నారు. అలాగే, 17 మంది గాయపడ్డారు.

సింధ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ముర్తాజా వాహబ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరాచీలోని షరియా ఫైసల్‌లో ఉన్న పోలీసు చీఫ్ కార్యాలయంలోకి ఎనిమిది మంది సాయుధ ఉగ్రవాదులు ప్రవేశించారు. కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు చనిపోగా, మరో ఇద్దరు తమనుతాము పేల్చేసుకున్నట్టు తెలిపారు. దీంతో, పోలీస్ స్టేషన్‌లోని భవనంలోని కొంతభాగం దెబ్బతింది. శక్తిమంతమైన పేలుడు కారణంగా సమీపంలోని భవనంలోని ఒక అంతస్తుకు కొంత నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు. ఉగ్రవాదులు హ్యాండ్ గ్రనేడ్లు, ఆటోమెటిక్ గన్స్ ఉపయోగించినట్టు అక్కడి మీడియా చెబుతోంది. ఉగ్రవాదులు రెండు కార్లలో సాయంత్రం 7.10 గంటలకు వచ్చినట్టు సీనియర్ పోలీసు అధికారి, డిఐజి ఇర్ఫాన్ బలోచ్ తెలిపారు. పోలీసు భవనంలో కాల్పులకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

సిసోడియాకు మరోసారి సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీష్ సిసోడియాకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) శనివారం మళ్లీ సమన్లు జారీ చేసింది. ఈ విషయాన్ని ఢిల్లీ డిప్యూటీ సిఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా శనివారం ట్వీట్ చేశారు. ఫిబ్రవరి 19న సిబిఐ ప్రధాన కార్యాలయానికి తనను పిలిపించిందని, విచారణకు తాను ఎప్పుడూ సహకరిస్తున్నానని, అలాగే కొనసాగుతానని మనీష్ సిసోడియా ట్వీట్ చేశారు. మనీష్ సిసోడియాకు వ్యతిరేకంగా లభించిన తాజా సాక్ష్యాధారాల ఆధారంగా ఆదివారం విచారణకు పిలిచామని సిబిఐ వర్గాలు వెల్లడించాయి. "ఆదివారం సిబిఐ నన్ను మళ్లీ విచారణకు పిలిచింది. ఇడి, సిబిఐ పూర్తి అధికారాన్ని నాపై ప్రయోగించారు. అధికారులు నా ఇంటిపై దాడులు చేశారు. నా బ్యాంకు లాకర్‌లో సోదాలు చేశారు. కానీ నాకు వ్యతిరేకంగా ఏమీ కనిపించలేదు" అని సిసోడియా ట్వీట్ లో పేర్కొన్నారు. సిసోడియాతో పాటు మరో 14 మందిపై సిబిఐ గతేడాది ఆగస్టులో ప్రత్యేక కోర్టులో కేసు నమోదు చేసింది. గతేడాది నవంబర్‌లో తీసుకొచ్చిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిబిఐ విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సిఫారసు చేశారు.

22న ఢిల్లీ మేయర్ ఎన్నిక

ఢిల్లీ : ఢిల్లీ మేయర్ ఎన్నిక ఈ నెల 22న జరగనుంది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన మేయర్ ఎన్నిక సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఖరారైంది. ఎంసిడి కార్యనిర్వాహక విభాగం శనివారం మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ రిలీజ్ చేసింది బుధవారం ఉదయం 11 గంటలకు ఎంసిడి సదన్‌లో ఈ ఎన్నిక జరగనుంది. అదే రోజున మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక తర్వాత.. ఆరుగురు సభ్యులుండే స్టాండింగ్ కమిటీని అదేరోజు ఎన్నుకుంటారు.



వేతన సమస్యపై జర్మనీ ఎయిర్‌పోర్టు వర్కర్ల సమ్మెతో బెర్లిన్, మ్యూనిచ్, ఫ్రాంక్‌ఫర్ట్, స్టట్‌గార్ట్, హాంబర్గ్, హనోవర్‌తో దేశమంతటా విమానాశ్రయాలు స్తంభించిపోయాయి. దాదాపు 2,300 దాకా విమానాలు నిలిచిపోయాయి. వేతనాల్లో 10.5 శాతం మేర పెంపుదలను కోరుతూ ఎరియర్‌పోర్టు గ్రౌండ్ సిబ్బంది 24 గంటల వాకౌట్ సమ్మెకు దిగారు.

హిమాచల్ గవర్నర్‌గా శివ్‌ప్రతాప్ శుక్లా ప్రమాణం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా శనివారం సంస్కృతంలో ప్రమాణ స్వీకారం చేశారు. శివ ప్రతాప్ శుక్లాతో హిమాచల్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సబీనా ప్రమాణం చేయించారు. హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు హాజరయ్యారు.

మేఘాలయ నూతన గవర్నర్‌గా ఫగూ చౌహాన్

మేఘాలయ నూతన గవర్నర్‌గా ఫగూ చౌహాన్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. మేఘాలయ రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేఘాలయ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఫగూ చౌహాన్ నూతన గవర్నర్‌గా నియమితులయ్యారు.


సియుఇటిలోకి రండి

వర్శిటీలపై యుజిసి ఒత్తిడి

న్యూఢిల్లీ: అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేర్చుకోడానికి నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సియుఇటి)లో అందరూ చేరాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) అన్ని విశ్వవిద్యాలయాలపై ఒత్తిడి తెస్తోంది. ఇది ప్రైవేట్ కోచింగ్ ఇండస్ట్రీని పెంచిపోషించడానికే ఉపయోగపడుతుందని విద్యావేత్తలు పలువురు అభిప్రాయపడ్డారు. యుజిసి సెక్రటరీ మనీష్ ఆర్ జోషి శుక్రవారం అన్ని యూనివర్సిటీలకు ఈ మేరకు లేఖ రాశారు. వివిధ తేదీల్లో , ఒక్కోసారి ఒకే తేదీలో జరిగే వివిధ ఎంట్రెన్స్ పరీక్షలకు హాజరుకావాల్సిన పని లేకుండా విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు, అలాగే విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇది తోడ్పడుతుందని యుజిసి పేర్కొంది.అన్ని రాష్ట్రాల వర్శిటీలు, డీమ్డ్ వర్శిటీలు, ప్రైవేట్ వర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు (హెచ్‌ఇఐలు)ను సియుఇటిలో చేరాలని యుజిసి కోరింది.

ఇక నీరు ప్రైవేటు సొత్తు!

నీటివ్యాపారంపై నీతి ఆయోగ్ కసరత్తు



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ప్రజలపై మరో పెను భారానికి సన్నాహాలు చేస్తోంది. ప్రజల కనీస అవసరమైన నీటితో వ్యాపారం చేయాలని చూస్తోంది. ఇప్పటికే దేశంలో సంపదను, అనేక వనరులను ప్రైవేటుకు, కార్పొరేట్ల పరం చేస్తున్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా నీటిని కూడా వారికి అప్పగించాలని చూస్తోంది. అందరికీ నాణ్యమైన నీటిని అందించడానికి బదులుగా డబ్బు చెల్లించేవారికే నీటిని అందించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నీటి వ్యాపారం కోసం ప్రపంచ ప్రమాణాలను అధ్యయనం చేయడానికి నీతి ఆయోగ్ ప్రణాళికలు సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. నీటి వ్యాపారంపై అధ్యయనం చేయాలనే నీతి ఆయోగ్ నిర్ణయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నయా ఉదారవాద వైఖరికి కొనసాగింపు అని, దానిని మరింతగా ముందుకు తీసుకెళ్లడమేనని నిపుణులు చెబుతున్నారు. నీటిని ప్రైవేటీకరించడం భారత్‌లో కొత్త కాదు. జాతీయ నీటి విధానం 2002లో సెక్షన్ 13, జాతీయ నీటి విధానం 2012లో సెక్షన్లు 11.6, 12.3 కూడా నీటి నిర్వహణలో ప్రైవేటు జోక్యాన్ని ప్రతిపాదించాయి. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. ఈసారి మోడీ ప్రభుత్వానిది పూర్తిగా కొత్త ఆలోచన. ఎందుకంటే ఇప్పుడు ప్రైవేట్ సంస్థలు నీరు, నీటి వనరులకు చట్టబద్ధమైన యజమానులుగా ఉంటాయి. ఇది అమల్లోకి వస్తే జాతీయ వనరు అయినప్పటికీ నీరు బంగారం, వెండి వలే అమ్ముడుపోతుంది. ఈ అంశంపై బలమైన చట్టాన్ని నీతి ఆయోగ్ ప్రతిపాదించవచ్చు. ఇప్పటికే నిరంతరం వరదలు, కరువు ఎదుర్కొంటున్న భారతీయులను నీరు పూర్తిగా వ్యాపారమయం చేయడం అనే ప్రతిపాదన కలవరపెడుతుంది. నీరు వాణిజ్యానికి సరుకుగా మారిన తరువాత నీరు ధర ఎంత ఉంటుందన్నది పేద, మధ్యతరగతి ప్రజలను కలవరపెట్టే ప్రధాన ప్రశ్న.

భారత్ వంటి దేశంలో నీటి వ్యాపారం అనే ఆలోచన సమానత్వం అనే భావనకే సవాలుగా నిలుస్తుంది. అందరికీ నీరు అనే దానికి బదులుగా డబ్బులు చెల్లించేవారికి నీరు అనేదాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. సమాజంలో కొనుగోలు శక్తిలో వ్యత్యాసం భిన్నంగా ఉంటుంది కాబట్టి, నీటి వ్యాపారంతో కొత్త అసమానతలు ఏర్పడతాయి. నీటి ఘర్షణలు, యుద్ధాలకు దారి తీయవచ్చు. వివిధ రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చవచ్చు. నీటి వివాదాలు సామాన్యం కావచ్చు. నీటి వ్యాపారంపై ప్రపంచ ప్రమాణాలను అధ్యయనం చేస్తున్న క్రమంలో నీతి ఆయోగ్ అమెరికా, ఆస్ట్రేలియా, చిలీ దేశాల్లోని వ్యవస్థను పరిశీలిస్తే.. ఆ దేశాలకు భారత్‌కు అనేక వ్యత్యాసాలు ఉన్నాయని నీతి ఆయోగ్ గ్రహించాలి. భారత్‌లో వర్షాల అనిశ్చితి, జనాభా సాంద్రత, వైవిధ్యమైన వృద్ధి అవసరాలు పైన పేర్కొన్న దేశాల కంటే భిన్నంగా ఉంటాయి. దీనిని నీతి ఆయోగ్ పరిశోధించడం చాలా అవసరం. భారతీయ మార్కెట్ వ్యవస్థలు ఇంకా వృద్ధి దశలో ఉన్నందున, సరైన అవగాహన లేకుండా నీటి వ్యాపారాన్ని అనుమతించడం తొందరపాటు చర్యగా నిరూపించబడవచ్చు.

ఇంగ్లండ్‌లో చేదు అనుభవం

నీటి ప్రైవేటీకరణలో చేదు అనుభవాలను ఎదుర్కొన్న తరువాత ఇంగ్లండ్ నీటి వ్యాపారాన్ని విరమించుకుంది. దానికి బదులుగా నీటి నిర్వహణ ప్రక్రియలను మునిసిపలైజ్ చేసింది. నీటి వ్యాపారం నీతి ఆయోగ్ ఉద్దేశ్యం కాబట్టి నీతి ఆయోగ్ అనేక అంశాలపై దృష్టి పెట్టాలి. హేతుబద్ధమైన, సమర్థవంతమైన, అవినీతి రహిత పర్యవేక్షణ వ్యవస్థల గురించి ఆలోచించాలి. జాతీయ వనరు అయిన నీరు వాణిజ్యానికి వనరుగా ఎలా ఉంటుంది?, ఎంఎన్‌సి కంపెనీల పెట్టుబడులను ప్రభుత్వం ఎలా నియంత్రిస్తుంది? అనే ప్రశ్నలకు నీతి ఆయోగ్ జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. ఏది ఏమైనా నీటి యజమానులుగా ఎంఎన్‌సిల ప్రమేయం భారత దేశ నీటి భద్రతకు స్పష్టమైన ముప్పుగానే భావించాలి.

గాలి కూడా అమ్మేస్తారు

లక్షలాది మంది ప్రజలు తాగునీటిని సేకరించడానికి, నిల్వ చేయడానికి మైళ్ల దూరం నడిచి వెళ్లవలసిన పరిస్థితిలో, లాభాలను పెంచుకోవడానికి నీటిని ప్రైవేటీకరణ చేయడం నేరం. తరువాత, గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని సాకుగా చూపి, మోడీ ప్రభుత్వం మనం పీల్చే గాలిని కూడా ప్రైవేటీకరిస్తుంది.

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్

దళిత విద్యార్థి ఆత్మహత్యపై అంతర్గత కమిటీని పునర్వ్యవస్థీకరించండి

- మూడు విద్యార్థి సంఘాల డిమాండ్

ముంబయి: ఇటీవల ఓ దళిత విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న దరిమిలా దానికి దారితీసిన పరిస్థితులపై విచారణకు ఐఐటి బొంబాయి నియమించిన అంతర్గత కమిటీని మూడు విద్యార్థి సంఘాలు తిరస్కరించాయి. మరింత మంది ఎస్సీ, ఎస్టీ సభ్యులను, వెలుపల నుండి కొంత మందిని చేర్చుకునేందుకు వీలుగా ఈ కమిటీని పునర్వ్యవస్థీకరించాలని అవి డిమాండ్ చేశాయి. అంబేద్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ (ఎపిపిఎస్‌సి), అంబేద్కర్ స్టూడెంట్స్ కలెక్టివ్, డస్టాక్ సంఘాలు ఐఐటి అధికారులకు శుక్రవారం నాడు ఈ మేరకు ఒక మెమోరాండం సమర్పించారు. కమిటీకి అధ్యక్షుడిగాను, కమిటీ సభ్యుల్లో సగం మంది దాకా ఎస్సీ, ఎస్టీ సభ్యులు ఉండాలని మూడు సంఘాలు ముక్త కంఠంతో కోరాయి. ఇనిస్టిట్యూట్ డైరక్టర్ సుభాషిస్ చౌదరి రాజీనామా చేయాలని, ఆయనపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక, ర్యాగింగ్ నిరోధక చట్టాల కింద కేసు పెట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. దర్శన్ సోలంకి(18) గత ఆదివారం హాస్టల్ బిల్డింగ్ లోని ఏడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కులపరంగా ఎగతాళి వల్లే సోలంకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతని స్నేహితులు చెప్పారు. పోలీసులు దీనిని ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న మరణంగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ కమిటీకి అధిపతి ఎవరో మాకు ఇప్పటివరకు తెలీదు.దీనిని కప్పిపుచ్చేందుకే ఈ ప్యానల్‌ను వేసినట్టనిపిస్తోందని ఎపిపిఎస్‌సి సభ్యుడు ఒకరు చెప్పారు.



కాళ్ళరాసి బతుకగలడె?



హిమాలయం కరుగుతోంది
సుమాలయం చిదుగుతోంది
వేడెక్కెను భూగోళం
పాడెక్కను మన ప్రాణం!

ఎందుచేత? ఎందుచేత?
మన బతుకున చావు కూత!

గంగానది యింకుతోంది
యమునానది ఎండుతోంది
వేడెక్కెను ఆ గగనం
మాడిపోయె జీవగణం

ఎందుచేత? ఎందుచేత?
జీవజాతికి గుండె కోత?

బూడిదయ్యె మట్టి కణం

హరించెనే హరితవనం
చుట్టుకుంది విషవలయం
జరుగుతోంది జనహననం

ఎందుచేత? ఎందుచేత?
మానవులకు పెట్టె వాత!

పరిశ్రమలు కక్కుతున్న
పరమ విషం ఆపాలి!
పదులకొలది చెట్లుపెంచి
ప్రాణం నిలబెట్టాలి!


పెట్రోలును మండించకు
ప్లాస్టిక్కును పండించకు
నేలబొగ్గు ముట్టబోకు
స్వచ్ఛతనే వదులబోకు!

ఏసిల్లో ఏమున్నది ?
ఫ్రిజ్జుల్లో ఏమున్నది?
క్లోరోఫ్లోరోకార్బన్
విషవాయువు దాగున్నది!

సుఖయానం మరిగి నరుడు
ప్రకృతి నాశము మానడు
సహజీవన సౌందర్యం
కాళ్ళరాసి బతుకగలడె?


- కిలపర్తి దాలినాయుడు
సాలూరు, పార్వతీపురం జిల్లా

తేడాలు గుర్తించండి



పిల్లలూ! ఈ చిత్రంలో ఐదు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ





పత్రి శృతి,
7వ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల కథల టీచరమ్మ

అక్షరాలు నేర్వాలంటే పలక, బలపమే అవసరం లేదు.. పాఠాలు చెప్పడానికి పుస్తకాలే అక్కర్లేదు.. తోటపని చేస్తూ.. బొమ్మలు గీస్తూ.. నటిస్తూ.. నర్తిస్తూ.. ఏ రకంగానైనా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించొచ్చు అంటున్నారు ఈ టీచరమ్మ. 24 ఏళ్లుగా బోధనావృత్తిలో ఉన్న నంబూరి మనోజ ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా వెంకటాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. పక్షులు, జంతువులు, మిఠాయిల పేరుతో పిల్లల కథలు, ఆత్మహత్యలు వద్దంటూ నాటికలు, క్యాన్సర్ అవగాహనపై బుర్రకథ, పిల్లల పత్రిక, పద్యాలు, రేడియో నాటికలు వంటి వాటిని స్వయంగా రచిస్తూ సామాజిక అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించడంలో ముందుంటారు.



చిన్నారి : అమ్మా ఆ నల్లపిల్ల నన్ను తోసేసింది బడిలో..

అమ్మ : ఏవిటి నల్లపిల్లేంటి? ఆమెకు పేరు లేదా..

చిన్నారి : ఆ.. ఉందిలే కాని మేమంతా అలాగే పిలుస్తాం.

అమ్మ : అది మంచిది కాదు.. తప్పు.. నువ్వలా మాట్లాడకూడదు..

నల్ల పిల్లలు మంచి వారు కాదని నీకెవరు చెప్పారు? తను చాలా మంచిది.. చక్కగా బొమ్మలేస్తుంది. అందరితో చక్కగా మాట్లాడుతుంది.. ఇంకెప్పుడూ నల్ల పిల్ల అని పిలవకు.. ఆ పిల్ల పేరుతోనే పిలవాలి.. సరేనా..

చిన్నారి : సరే అమ్మా.. సారీ.. ఇంకెప్పుడూ ఆ అమ్మాయిని అలా పిలవను..

ఇలాంటి సాధారణ సంభాషణలతోనే పిల్లల్లో వివక్ష ఏర్పడకుండా చూస్తారు ఆమె. 'పుస్తకాల్లో కుల, మత, జాతి వివక్ష అని రాస్తాం, అదే చెబుతాం. కాని ఎంతమంది పిల్లలకు అది అర్థమవుతుంది? అందుకే వారికి అర్థమయ్యే భాషలో.. బొమ్మల రూపంలో కథలుగా వారికి చెబుతుంటాను. అలా నేర్చుకున్న సంభాషణ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుంది' అంటారు మనోజ.

'అమ్మ తోటపని చేస్తుంది.. నాన్న పాయసం తిందూ రమ్మన్నాడు.. అన్నయ్య, చెల్లి, నేను వెళ్లాం. పక్కింటి ఆంటీకి కొంచెం పాయసం ఇమ్మని అమ్మ చెప్పింది. నేనేమో పిల్లికి కొంచెం పెడతానన్నాను..' వంటి మాటలు, బొమ్మలతో చెప్పిన కథలో ఇంటి పనిలో ఆడ, మగ విభజన లేకుండా ఉండాలని, తోటి వారికి సాయపడాలని, జంతువులు, పక్షుల పట్ల దయతో ఉండాలన్న విషయాలు అర్థమవుతాయి. ఇలా మనోజ రచనలు క్లుప్త పదాలతో.. ఆసక్తి కలిగేలా సాగుతాయి.

కూరగాయలు పండించడం, బొమ్మలు గీయించడం, పద్యాలు వల్లె వేయించడం, నాట్యం నేర్పించడం వంటివాటిలో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తనను తాను నిత్యవిద్యార్థిగా మార్చుకున్న ఈ టీచరమ్మ వారి జీవితాలు ప్రమాదంలో పడితే ఎంతటివారినైనా ఎదిరించేందుకు సిద్ధంగా ఉంటారు. తాగుబోతు తండ్రులతో నిత్యం నరకం చూసే పిల్లలు ప్రశాంతంగా చదువుకోవాలని ఇప్పుడు తను ఉంటున్న గ్రామాన్ని మద్యపాన రహితంగా తయారుచేసేందుకు కంకణం కట్టుకున్నారు.



'ప్రథమ్' ప్రశంసలు..

ఆమె ప్రతిభ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే అంతర్జాతీయ సంస్థ 'ప్రథమ్' ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో మృగ్యమౌతున్న మౌలిక బోధానాంశాలను మెరుగుపర్చేందుకు ప్రపంచవ్యాప్తంగా 'తర్ల్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మొత్తం 17 దేశాల్లో అన్ని ప్రభుత్వ స్కూల్లో ఆ కార్యక్రమం మొదలుపెట్టారు. అందులో వారు నిర్దేశించిన కార్యక్రమాలే కాక తను సొంతంగా తయారుచేసుకున్న కార్యక్రమాలను పిల్లలతో చేయించి మంచి ఫలితం పొందినందుకు నైజీరియా నుండి ఓ బృందం మనోజ పని చేస్తున్న స్కూలును సందర్శించి అభినందించారు. పిల్లల్లో మెరుగుపడిన బోధనాంశాలు, వారి సమయానుకూల స్పందన ఆ బృందాన్ని అబ్బురపరిచింది. ఇలా మనోజ ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు..

నైజీరియా బృంద సందర్శన..

'తర్ల్' కార్యక్రమ నిర్వహణను పరిశీలించేందుకు నైజీరియా నుండి ఆ బృందం వచ్చినప్పుడు..

'మా వెంకటాపురం స్కూల్‌కు నైజీరియన్ బృందం, 'తర్ల్' ఢిల్లీ సభ్యులు కలిసి వచ్చారు. మా విద్యార్థిని పాయల్ బృందం స్వాగత గీతంతో వారికి ఆహ్వానం పలికింది. ఆ తరువాత తను తయారుచేసిన నైజీరియన్ జెండాలు వారికిచ్చింది. ఓ అరగంట నా తెలుగు క్లాస్ డెమో పరిశీలించిన ఆ బృందం, స్కూలు ఆవరణలో పిల్లలు స్వయంగా ఏర్పాటుచేసిన 'సంత' ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. మా బడి తోటలోంచి వంకాయలు, బెండ, చిక్కుడు, బంతి, మందారపూలు, తమలపాకులు తెంపుకొచ్చి పిల్లలంతా కూరగాయలు అమ్మేవాళ్లుగా తయారైపోయారు. నకిలీ నోట్లతో నైజీరియన్ బృందం వాటిని కొనుగోలు చేసింది. వాళ్లల్లో ఒకతను చేపలు అమ్మిన దేవికి వెయ్యి నోట్లు ఇచ్చారు. దేవి వెంటనే 'నో చేంజ్...ఫోన్ పే' ఉంది అంటూ అట్టముక్కకు అంటించుకున్న తన పాత టెక్స్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ని చూపించింది... ఆశ్చర్యంతో వాళ్ల ముఖాలు వెలిగిపోయాయి. ఇక మా ఉత్తేజ్ గాడు కొనుగోలుదార్ల ఉత్తేజం కోసం ఓ పేపర్ గ్లాసుల కట్ట, నా స్టీల్ వాటర్ బాటిల్ పట్టుకుని టీ....టీ...తాగండి.. ఐదు రూపాయలే.. అంటూ పొలికేకలు పెడుతూ కాసేపు టీ అమ్మాడు. పుట్టినరోజులప్పుడు తిన్న చాక్లెట్ రేపర్స్‌లో సుద్దముక్కలు చుట్టి పెట్టి రాజశేఖర్ డమ్మీ చాక్లెట్లు అమ్మేశాడు. చివర్లో... తోటలో వాళ్ళు విహరిస్తుండగా, జశ్వంత్ ముదురు బెండకాయను తెరిచి సీడ్స్ అంటూ వారి చేతిలో పోశాడు' అని ఆమె చెబుతున్నప్పుడు ఆ మాటల్లో ఎంతో ఆనందం ధ్వనించింది.

కరోనా సమయంలో సర్వ శిక్షా అభియాన్ తరపున కృష్ణా జిల్లా ప్రతినిధిగా పిల్లల కథలు రాయడం, ఇతర టీచర్లకు శిక్షణ ఇవ్వడం, బొమ్మలు వేయించడం చేశారు. త్వరలో అవి అందుబాటులోకి రానున్నాయి.

ఆరోగ్యం సహకరించకపోయినా..

బ్రెస్ట్ క్యాన్సర్ సోకి రెండేళ్ల చికిత్స అనంతరం కోలుకున్న మనోజ వైద్యం చేయించుకునే సమయంలో కూడా పిల్లల కోసం, వారి బాగోగుల కోసం పరితపించారు. సాధారణంగా ఇచ్చే సెలవును వద్దనుకుని క్లాసులకు హాజరయ్యారు. అప్పుడే ఎంఎ తెలుగు పరీక్షకు సిద్ధమై మంచి ఉత్తీర్ణత సాధించారు. క్లిష్టమైన సమయంలో కూడా విధుల నుండి తప్పుకునే అవకాశం ఉన్నా 'పిల్లలతో ఉంటేనే త్వరగా కోలుకుంటానని చెప్పి వెళ్లేదాన్ని' అంటున్న ఆమె తన ఆరోగ్య పరిస్థితి తోటి ఉపాధ్యాయులకు రాకూడదని తన స్నేహితుల ద్వారా ఓ మొబైల్ మెడికల్ వ్యాన్ సిద్ధం చేసి ప్రతి స్కూల్లో మహిళా ఉపాధ్యాయులందరికీ హెల్త్ చెకప్‌లు చేయించారు. ఆ పరీక్షల్లో క్యాన్సర్ ప్రమాదం బారిన పడిన ఓ ముగ్గురికి వైద్య సాయమందేలా చూశారు.



పుస్తక పఠనం చేయించాలి..

పిల్లలతో పుస్తకాలు చదివించాలన్న లక్ష్యంతో స్కూల్లోనే గ్రంథాలయం నిర్వహించడం ఆమె దినచర్యలో భాగం. ఆమె సంకల్పాన్ని అభినందిస్తూ.. కొంత మంది దాతలు వందలాది పుస్తకాలు బహుకరించారు. 'ప్రథమ్' సంస్థ నుండే 15 వేల పుస్తకాలు వచ్చాయి. ఇప్పుడు ఆ పుస్తకాలతో తన స్కూల్లోనే కాక ఆసక్తి ఉన్న ఇతర పాఠశాలల్లో కూడా గ్రంథాలయాలు నిర్వహించేలా గ్రంథాలయ ఉద్యమం నడిపిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి తన సొంత ఖర్చులతో పిల్లలను తీసుకెళ్లారు. 'బాలోత్సవ్' వంటి అనేక కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. ఏ కార్యక్రమమైనా పిల్లలకు తర్ఫీదు ఇవ్వడం, తన సొంత ఖర్చులతో అందులో పాల్గొనేలా చేస్తారు. ఆమె విద్యార్థులు ఎందులో పాల్గొన్నా.. ప్రత్యేకంగా గుర్తింపబడతారు.. ప్రశంసలు అందుకుంటారు.

'ప్రభుత్వ స్కూళ్ల దండగని, పిల్లలు సరిగా చదవరని అందరూ అనుకుంటారు. కాని మా స్కూలు పిల్లలు ఆ ధోరణికి స్వస్తి పలికారు. నేను ఏ స్కూలుకు వెళ్లినా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారిలో దాగున్న నైపుణ్యాలను మెరుగుపరుస్తూ.. మంచి లక్షణాలు అలవడేలా తీర్చిదిద్దుతాను' అంటున్న మనోజ 'ప్రభుత్వ బడిలో చదివిన పిల్లల ప్రతిభ ప్రపంచానికి చాటిచెప్పాలన్నదే నా ధ్యేయం' అంటున్నారు.

- జ్యోతిర్మయి

శివరాత్రి సందర్భంగా



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చిత్రం 'బోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇప్పటివరకు రిలీజైన పోస్టర్‌లు మంచి అంచనాలే క్రియేట్ చేశాయి. శివరాత్రి సందర్భంగా చిత్రబృందం ఓ గ్లింప్స్ వీడియో విడుదల చేసింది. అందులో ఓ పాటలో చిరంజీవి డమరుకం పట్టుకుని స్టెప్ వేస్తున్న దృశ్యం విడుదల చేశారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ఆకట్టుకునేలా ఉంది. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో చిరంజీవి చెల్లెలిగా కీర్తి సురేష్ నటిస్తుంది. ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన 'వేదాళం'కు రీమేక్‌గా తెరకెక్కుతుంది.

ఓటీటీలోకి 'మైఖేల్ '



హీరో సందీప్ కిషన్ నటించిన చిత్రం 'మైఖేల్' . ఫిబ్రవరి 3న థియేటర్లో విడుదలైంది. ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. ఓటీటీ 'ఆహా' వేదికగా ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఈ చిత్రాన్ని అందుబాటులోకి రానుంది. జైలులో పుట్టి..పెరిగిన హీరో తన తండ్రిని చంపడమే లక్ష్యంగా ముంబయిలో అడుగు పెడతాడు. ఈ క్రమంలో మాఫియా గ్యాంగ్ లీడర్ దగ్గరకు చేరడం, ఆ తర్వాత ప్రేమలో పడటం జరుగుతుంది. తండ్రిని చంపాడా? లేదా? అసలు హీరో తల్లి జైలుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చింది అనే అంశాలు అసక్తికరంగా ఉంటాయి. కథలో విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్ కుమార్‌లు కీలక పాత్రలో నటించారు.

సంక్రాంతి కానుకగా 'ప్రాజెక్ట్-కె'

మహాశివరాత్రి సందర్భంగా ప్రభాస్ అభిమానులకు 'ప్రాజెక్ట్-కె' చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్‌లో దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ తెలిపింది. దీంతో పాటు పోస్టర్ కూడా విడుదల చేసింది. భారీ చేయి కింద పడి ఉండగా, ముగ్గురు వ్యక్తులు గన్స్‌తో చేయి వైపు గురి పెడుతూ నిలబడ్డారు. ఈ వార్త విన్న అభిమానులకు సంక్రాంతి పండగ ఆనందం ఇప్పుడే వచ్చినట్లే అయ్యింది.





'హీరమండి' ఫస్ట్‌లుక్

వాస్తవిక కథలను అందంగా, అందరికి అర్థమయ్యేట్టుగా తెరపై చూపించడంలో సంజయ్ లీలా భన్సాలీ సిద్ధ హస్తుడు. ప్రస్తుతం 'హీరమండి' అనే వెబ్‌సిరీస్ తెరకెక్కిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఈ సిరీస్‌ను భన్సాలీ తెరకెక్కిస్తున్నాడు. స్వాతంత్ర్యానికి ముందు 'హీరమండి' ప్రాంతంలోని వేశ్యల కథలను ఈ వెబ్‌సిరీస్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. అలాగే, ఇక్కడి సాంస్కృతిక వాస్తవాలను కూడా తన సెట్ సిరీస్‌లో స్పృశించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వెబ్‌సిరీస్ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. పోస్టర్‌లో మనిషా కొయిరాల, అతిధిరావు హైదరి, రీచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్, సోనాక్షి సిన్హాలు క్వీన్స్ గెటప్‌లలో రాయల్ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ వెబ్‌సిరీస్ ఈ ఏడాది ద్వితీయార్థంలో స్ట్రీమింగ్ కానున్నట్లు సమాచారం.

మనాలిలో దేవరసంత

హీరో విజయ్ దేవరకొండకు దేశమంతంటా అభిమానులు ఉన్నారు. తన అభిమానులకు నిత్యం అందుబాటులో ఉంటూ బాగా చూసుకుంటాడన్న పేరు విజయ్‌కు ఉంది. విజయ్ తన ఫ్యాన్స్ కోసం ఐదేళ్ల క్రితం ఓ నూతన వరవడికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగ, కొత్త సంవత్సరం సందర్భంగా.. దేవరసంత అనే క్యాంపెయిన్ పేరుతో వంద మంది అభిమానులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి వారికి బహుమతులు అందిస్తూ వస్తున్నాడు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా దేశంలోని 100 మంది అభిమానులను హాలిడే ట్రిప్‌కి పంపించారు. ఈ విషయాన్ని విజయ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. ఈ నెల 17న టూర్ ప్రారంభం కాగా టూర్‌కు వెళ్తూ ఫ్యాన్స్ పంపిన వీడియోను విజయ్ ట్విట్టర్ ద్వారా షేర్ చేశాడు.



ఆదుకున్న అక్షర్, అశ్విన్

8వ వికెట్‌కు 114పరుగుల భాగస్వామ్యం ● భారత్ 262ఆలౌట్ ● లియాన్‌కు ఐదు వికెట్లు



న్యూఢిల్లీ: రెండోటెస్ట్‌లో ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యత సాధిస్తునుకున్న దశలో టీమిండియా ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ కలిసి 8వ వికెట్‌కు 114పరుగులు జతచేయడంతో భారతజట్టు తొలి ఇన్నింగ్స్‌లో 262పరుగులు చేయగల్గింది. దీంతో ఆస్ట్రేలియా జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం ఒక్క పరుగు ఆధిక్యత మాత్రమే లభించింది. ఓవర్ నైట్ స్కోర్ 21 పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన భారత్‌ను ఆస్ట్రేలియా సీనియర్ స్పిన్నర్ లియాన్ టాప్‌ఆర్డర్‌ను కూల్చాడు. 17వ ఓవర్‌లో కేఎల్ రాహుల్ (17)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న లియాన్.. తన తర్వాతి ఓవర్‌లో రోహిత్ శర్మ (32), పుజారా(0)లను ఔట్ చేసి భారత్‌ను దెబ్బ తీశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్(4) కూడా నాథన్ బౌలింగ్‌లో హ్యాండ్స్‌కాంబ్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఓ దశలో ఔటైన తర్వాత క్రీజులోకి అక్షర్ పటేల్ ఆది నుంచి దూకుడుగా ఆడాడు. టీ బ్రేక్‌కు ముందు కుహ్నేమాన్ వేసిన ఓవర్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. తర్వాత కూడా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టాడు. కుహ్నేమాన్ వేసిన 75వ ఓవర్‌లో సిక్సర్ బాది అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కమిన్స్ వేసిన 79వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో ఉన్న అశ్విన్(37) అతడికి సహకారం అందించాడు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నెలకొల్పారు. అశ్విన్‌ను కమిన్స్ ఔట్ చేయగా.. మర్ఫీ వేసిన తర్వాతి ఓవర్‌లో సిక్సర్ బాది జోరు మీద ఉన్న అక్షర్.. కమిన్స్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు ఔటయ్యాడు. షమి (2)ని కుహ్నేమాన్ పెవిలియన్‌కు పంపడంతో భారత్ ఆలౌటైంది. లియాన్‌కు ఐదు, కుహ్నేమన్, మర్ఫీకి రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టు శుక్రవారం ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోయి 61పరుగులు చేసింది. ఖవాజా(6) అశ్విన్ బౌలింగ్‌లో శ్రేయస్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు ఔటయ్యాడు.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 263, రెండో ఇన్నింగ్స్ 61/1

ఇండియా తొలి ఇన్నింగ్స్: రోహిత్ (బి)లియాన్ 32, కేఎల్ రాహుల్ (ఎల్‌బి) లియాన్ 17, పుజారా (ఎల్‌బి)లియాన్ 0, కోహ్లి (ఎల్‌బి)కుహ్నేమన్ 44, శ్రేయస్ (సి)హ్యాండ్‌కోంబ్ (బి)లియాన్ 4, జడేజా (ఎల్‌బి)మర్ఫీ 26, శ్రీకర్ భరత్ (సి)స్మిత్ (బి)లియాన్ 6, అక్షర్ (సి)కమిన్స్ (బి)మర్ఫీ 74, అశ్విన్ (సి)రెన్‌షా (బి)కమిన్స్ 37, షమీ (బి)కుహ్నేమన్ 2, సిరాజ్ (నాటౌట్) 1, అదనం 19. (83.3 ఓవర్లలో ఆలౌట్) 262పరుగులు. వికెట్ల పతనం: 1/46, 2/53, 3/54, 4/66, 5/125, 6/135, 7/139, 8/253, 9/259, 10/262 బౌలింగ్: కమిన్స్ 13-2-41-1, కుహ్నేమన్ 21.3-4-72-2, లియాన్ 29-5-7-5, మర్ఫీ 18-2-53-2, హెడ్ 2-0-10-0

మంధాన మెరిసినా.. ఇంగ్లండ్ చేతిలో ఓటమే..!

● 20న ఐర్లాండ్‌పై గెలిస్తేనే సెమీస్ బెర్త్..



కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఇంగ్లండ్ చేతిలో 11 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 151పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5 వికెట్లు కోల్పోయి 140పరుగులే చేయగల్గింది. టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ తొలిగా బౌలింగ్‌ను ఎంచుకుంది. ఇంగ్లండ్ టాపార్డర్‌ను రేణుక కట్టడి చేయడంతో ఇంగ్లండ్ జట్టు 29పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో స్కీవర్(50), జోన్స్(40), కెప్టెన్ నైట్(28) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఇంగ్లండ్ జట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 151పరుగులు చేసింది. రేణుకకు ఐదు, శిఖాపాండే, దీప్తి శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన(52) రాణించినా.. షెఫాలీ(8), రోడ్రిగ్స్(13), హర్మన్ ప్రీత్(4) నిరాశపరిచారు. ఆ తర్వాత రీచా ఘోష్(47) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ప్రయోజనం లేకపోయింది. చివరి ఓవర్లు 30పరుగులు చేయాల్సి దశలో రీచా 18పరుగులు రాబట్టింది. దీంతో టీమిండియా నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 140పరుగులే చేయగల్గింది. గ్లెన్‌కు రెండు, ఎక్లేస్టోన్, బెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కీవన్‌కు లభించింది. ఇక గ్రూప్-బిలో శుక్రవారం అర్ధరాత్రి మరో మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 6వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. ఐర్లాండ్ జట్టు 20 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 139పరుగులు చేస్తే.. విండీస్ జట్టు 19.5ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 140పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మాథ్యూస్‌కు లభించింది.

మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు..
పాకిస్తాన్ × వెస్టిండీస్(సా.6.30గం॥లకు)
న్యూజిలాండ్ × శ్రీలంక(రా.10.30గం॥లకు)

కాంస్యంతో సరి..

ఆసియా బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్

దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కాంస్యం పతకం సాధించింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో భారత బ్యాడ్మింటన్ జట్టు కాంస్య దక్కడం ఇదే తొలిసారి. శనివారం జరిగిన సెమీస్‌లో భారత్ 2-3తేడాతో పటిష్ట చైనా చేతిలో పోరాడి ఓటమిపాలైంది. తొలి రెండు సింగిల్స్‌లో ఓటమిపాలైన భారత్ 0-2తో వెనుకబడ్డా.. ఆ తర్వాత పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్‌లో నెగ్గి 2-2తో సమం చేసింది. పురుషుల తొలి సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ రాయ్ 13-21, 15-21తో లీ-లాన్-షీ చేతిలో, మహిళల సింగిల్స్‌లో పివి సింధు 9-21, 21-16, 18-21తో జో-ఫంగ్-జీ చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక పురుషుల డబుల్స్‌లో ధృవ్ కపిల-చిరాగ్ శెట్టి జోడీ 21-19, 21-19తో హి-జి-టింగ్/జో-హోపై గెలుపొందగా.. మహిళల డబుల్స్‌లో త్రీషా జోలీ-గాయత్రీ గోపీచంద్ జోడీ 21-18, 13-21, 21-19తో లీ-షెంగ్/టంగ్ నింగ్‌పై పోరాడి నెగ్గారు. నిర్ణయాత్మక మిక్స్‌డ్‌లో ఇషా భట్నాగర్-తనీషా జోడీ 17-21, 13-21తో ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68